ఆదివారం
ప్రజాశక్తి
అక్టోబర్ 26, 2003

కరుణామయి మదర్ థెరిస్సా

హ్యాపీ బర్త్‌డే (26-10-2003నుండి 1-11-2003వరకు)

మణికంఠ
3సం॥, 26-10-2000
పుష్ప- నర్సయ్య
తాటిపాముల- నల్లగొండ

కె. తేజేశ్వరరావు
8సం॥, అక్టోబర్-1995
పార్వతి-అప్పలనర్సయ్య
గణపతినగర్-విశాఖ

నాని
1సం॥, 26-10-2002
మొగులమ్మ- జగదీష్
లాల్‌కోట- మహబూబ్‌నగర్

కరిష్మా
అక్టోబర్- 26
రజియా- రియాజ్
సూళ్లూరుపేట-నెల్లూరు

శివకుమార్(నాని)
2సం॥, 27-10- 2001
గోదావరి- గంగాధర్
లక్కోర- నిజామబాద్

షేక్ అష్పాక్ బాష
1సం॥, 28-10-2002
షమీమ్‌బాను-మహబూబ్‌బాష
పీలేరు-చిత్తూరు

ఎస్. లలిత
3సం॥, 28-10-2000
లక్ష్మి- ఏడుకొండలు
శేషంవారిపాలెం- ప్రకాశం

నికిల
3సం॥,29-10-2000
కవిత-జనార్దన్
షాబాద్-రంగారెడ్డి

టి. నవీన్
3సం॥, 30-10-2000
అమరావతి- అమరనాథ్
రెడ్డివారిపల్లి- చిత్తూరు

సిహెచ్. దాక్షయణి
4సం॥, 31.10.1999
కృష్ణవేణి- ఉమామహేశ్వరరావు
కురుపాం- విజయనగరం

ఎం. చందన
2సం॥ 31-10- 2001
శారద-సంపత్
చీమకుర్తి- ప్రకాశం

కె. సాయికళ్యాణి
2సం॥, 1.11.2001
పద్మావతి- వెంకట్రావు
సమతానగర్- ప్రకాశం

సంతోష్‌కుమార్
7సం॥, అక్టోబర్-1996
చిట్టెమ్మ-నర్సింహ్మా
రావిపాకుల-మహబూబ్‌నగర్

రమ్యశ్రీ
2సం॥, అక్టోబర్-2001
రాజేశ్వరి- శ్రీనివాస్
అనకాపల్లి

కె. జయకృష్ణ
7సం॥, అక్టోబర్-1996
జయలలిత- మురగారెడ్డి
తిమ్మాపురం- చిత్తూరు

జి. వెంకట నర్సమ్మ
అక్టోబర్
సుజాత- వెంకటేష్
నారాయణపేట-మహబూబ్‌నగర్

లీడర్స్ మెయిల్

మందుపాతర గురించిన వివరాలు తెలిశాయి

అక్టోబర్ 12 ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ బావుంది. మందుపాతరలకు సంబంధించిన అనేక వివరాలు తెలిసాయి. కవర్‌పేజీ కూడా బావుంది. వాటితోపాటు 'దర్జా ఎల్లయ్య' రియల్‌స్టోరీ మమ్మల్ని ఆకర్షించింది. రోడ్డువెడల్పు పనుల్లో తన షాపుపోయినందని చింతించకుండా చిన్న బండిమీదే మిషన్ పెట్టుకొని సంచార దర్జీగా మారి, తనతోపాటు మరో ఇద్దరికి జీవనోపాధి కల్పించడం ద్వారా ఎంతోమంది ఎల్లయ్య ఆదర్శనీయుడు. గత వారం పెట్టిన విధంగా 'రుచి' పెడతారని ఆశించాం. క్రమం తప్పకుండా 'రుచి'ని పెట్టగలరు. తాను కూర్చున్న చెట్టును తానే నరుక్కుంటున్న మనవున్ని గురించి 'చింత చింత' ద్వారా తెలుసుకున్నాం. తనలోని ఆవేదనను చింతచెట్టు ఆత్మఘోష రూపంలో వివరించిన రచయిత్రి రాణి పులోమజాదేవికి అభినందనలు.

బి.క్రాంతి, మానుకొండవారిపాలెం, గుంటూరు జిల్లా.

రియల్ స్టోరీ బాగుంది

అక్టోబర్ 12 నాటి హాపీ బర్త్‌డే పేజీ బాగుంది కవర్ స్టోరీ కూడా బాగుంది. బాలల కథ, మారిన బుద్ధి చాలా బాగుంది. రియల్ స్టోరీ శీర్షికన ప్రచురితమైన "దర్జా ఎల్లయ్య" కూడా బాగుంది. టైలర్ల జీవితం ప్రస్తుతం ఎలా ఇబ్బందుల్లో ఉంటుందో చాలా బాగా వివరించారు.

- చిన్న, హైదరాబాద్

పిల్లల పెంపకం

అక్టోబర్ 12 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'పిల్లల సందేహాలు తీర్చాలి' అనే వ్యాసంలో సందేహాలు తీరుస్తూ వారి వికాసానికి పెద్దలు ఏ విధంగా దోహదం చేయవచ్చో రచయిత చాలా బాగా చెప్పారు. గతంలో కూడా ఈ శీర్షికలో ఎన్నో మంచి విషయాలు చెప్పారు. పిల్లల పెంపకం తల్లిదండ్రులు ఎంత బాధ్యతాయుతంగా, ఎంత మెళకువగా వ్యవహరించాల్సి వుంటుందో చెబుతున్న ఈ శీర్షికను ఇలాగే ఉపయుక్తకరమైన వ్యాసాలతో కొనసాగించండి.

- ఎస్.సుబ్బరాజు, కర్నూలు

మందుపాతర టెక్నాలజీ అర్థవంతం

అక్టోబర్ 12 ఆదివారం అనుబంధంలో మనలో మాట శీర్షికన ప్రచురించిన 'రక్త దర్శనం' చాలా బాగుంది. అలాగే 'చింత చింత' కథలో చింత చెట్టు ఆత్మఘోషను చాలా చక్కగా వివరించారు. కవర్‌స్టోరీలో మందుపాతర టెక్నాలజీ గురించి అర్థవంతంగా వివరించారు. పిల్లల సందేహాలు ఎలా తీర్చాలో తల్లితండ్రులకు చాలా చక్కగా వివరించారు. మొత్తంగా ఆదివారం అనుబంధం పాఠకులను అలరిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరిన్ని కొత్త శీర్షికలు పెట్టి, పేజీలు పెంచి మరింత కలర్‌ఫుల్‌గా తెస్తారని ఆశిస్తున్నాను.

- జె.మానస, విజయవాడ

కచేరి ఆసక్తికరం

అక్టోబర్ 12వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రుక్మిణి గారి కచేరి ఆసక్తికరంగా సాగింది. లక్ష్మిగారు రాసిన 'కష్టమెకరిది...' బాగుంది. 'ఇంట్లో జిమ్‌కి ఈజీ పరికరాలు' శీర్షికన క్రీడారంగంలో వచ్చిన వ్యాసం చాలా ఉపయోగకరంగా ఉంది. అయితే అందులో పేర్కొన్న పరికరాల ధర సామాన్యులకు అందుబాటులో ఉండవు. ఇటువంటివి రాసినప్పుడు సాధారణ ప్రజలను కూడా దృష్టిలో వుంచుకుంటే బాగుంటుంది. పుస్తక పరిచయం ఫుల్‌పేజీ పెట్టడం బాగుండలేదు.

- కె.విజయకుమార్, జమిస్తాన్‌పూర్, హైదరాబాద్

పులిరాజు

మమ్మీ... మగవాళ్ళకు పిల్లలు పుడ్తారా?

ఐదేళ్ళ పాప అమాయక ప్రశ్న.

లేదమ్మా మగవాళ్ళకు పిల్లలు పుట్టరు.

తదుపరి ప్రశ్న ఏమిటో ఊహించని తల్లి సమాధానం.

మరి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసుకోవాలని టీవీలో చెప్తారేమిటి ?

అవాక్కయిన అమ్మ నుంచి జవాబు లేదు. ఎలా చెప్పాలో తోచలేదు.

* * *

ఏమిరా షాద్‌నగర్‌ల వానపడ్తుందా?

హైదరాబాద్ నుండి టెలిఫోన్లో పెదనాన్న ప్రశ్న.

ఇప్పుడు పడ్తలేదు గాని నిన్న మొన్న మస్తుపడ్డది.

అవతలి నుండి రెండో తరగతి చదువుతున్న పోరడి సమాధానం.

అట్లనా..

'హైద్రబాద్‌ల మయబ్‌నగర్‌ల గూడంక మస్తుపడ్డదట. హైద్రబాద్‌ల రెండు సెంటీమీటర్లో ఆరు సెంటిమీటర్లో పడ్డదట!'

ఏడేళ్ళ అబ్బాయి నోటి నుండి సెంటిమీటర్ల ప్రస్తావన.

"సెంటిమీటర్ల సంగతి నీకెట్ల తెలుసు"

ఆశ్చర్యపోయిన పెదనాన్న ప్రశ్న.

'టీవీల చెప్పిండ్రు గద'

* * *

మంచికైనా చెడుకైనా ప్రచార సాధనాలు ఇప్పుడు మహత్తర పాత్ర నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా టీవీ వల్ల పసిపిల్లలకు కూడా చాలా విషయాలు తెలుస్తున్నాయి. వారిలో చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవగాహన పెంచుకోవడానికి, అధ్యయనం సాగించడానికి మూలం ప్రశ్న.

పసిపిల్లలతో పేచీలేదు. వాళ్ళు దేన్నయినా చప్పున అర్థం చేసుకొంటారు. ఎటొచ్చీ పెద్దలతోనే సమస్య. పిల్లలకు అర్థమయిన విషయాలు కూడా పెద్దలకు అర్థం కావు. అదీ అధికారులైతే మరీ కనాకష్టం. అర్థం కాదో అహం అడ్డుపడ్తుందో తెలియదు.

లేకపోతే చూడండి... ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి తీరు. వారికి మగవారి ద్వారా కూడా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్న విషయం తెలియకుండా పోయింది. ఇప్పటికి ఆ సొసైటీ మూడు ప్రకటనలు జారీ చేసింది. రెండో ప్రకటన మహిళలను కించపరిచేదిగా ఉందని మహిళా సంఘాలు ఆగ్రహం ప్రకటించాయి. మహిళలు ధర్నాలు, సభలు నిర్వహించారు. మేధావులూ నిరసన వ్యక్తం చేశారు. అయినా మూడో ప్రకటనలోనూ అదే ధోరణి.

తిరుగుబోతు పురుషుల వల్ల అమాయకులైన భార్యలు బలవుతున్నారు. పచ్చని కాపురాలు అర్థాంతరంగా కుప్ప కూలుతున్నాయి. భయానక భవిష్యత్‌ను వెంటబెట్టుకొని పిల్లలు భూమ్మీద పడ్తున్నారు. ఎయిడ్స్‌తో చచ్చేవాడు ఎలాగూ ఛస్తాడు. కాని వెళ్ళేవాడు ఊరకే వెళ్ళేడు. భరింపరాని నరకాన్ని భార్యా పిల్లలకు వదిలి వాడు టపా కట్టేస్తాడు. తనకు ఎయిడ్స్ ఉన్నా, ఉండే అవకాశం ఉందని తెలిసినా పెళ్ళి చేసుకొనే "హంతకులూ" ఉన్నారు. ఇవన్నీ వదిలి పెట్టి పులిరాజా పట్ల మాత్రమే ఆందోళన వ్యక్తం చేయడం పురుషాధిక్యత ధోరణికి చిహ్నం. ఎయిడ్స్‌లాంటి మహమ్మారికి వ్యతిరేకంగా జరిగే ప్రచారంలోనూ ఈ ధోరణి ఉండటం నిస్సందేహంగా నేరం. ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 4
ఔరా!	. . . 5
కవర్ స్టోరీ	. . . 6
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
రియల్‌స్టోరీ	. . . 14
జీవనశైలి	. . . 15
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
గేయలహరి	. . . 22
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

చలిచీమలు

కథ ... 9, 10

క్యాన్సర్ రోగుల ఆశాకిరణం రేయిస్ సిండ్రోమ్

ఆరోగ్యం . . . 18, 19

సైబీరియా కొంగల విడిది వీరాపురం

టూరిస్ట్ గైడ్ . . . 21

కళ వినోదం కోసమే కాదు

కళాసాహితి . . . 23

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటెటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేనూ ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

..............................PIN..............

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

PSKT

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

10/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: **HYDERABAD: (•S.R.NAGAR ☎ 23714330. •MEHDIPATNAM ☎ 55755888. •DILSUKH NAGAR ☎ 24044352. •KUKATPALLY ☎ 55341431. •RAMACHANDRA PURAM. •VANASTHALI PURAM ☎ 24122464. • A.S.RAO NAGAR). •NELLORE ☎ 2327702. •THIRUPATI ☎ 2252878. •ANANTAPUR ☎ 241029. •KAKINADA ☎ 2386638. •VIJAYAWADA ☎ 5530053. •GUNTUR ☎ 2238541. •VISAKHAPATNAM ☎ 2738892. •KURNOOL. •RAJAHMUNDRY ☎ 2422003. •NIZAMABAD ☎ 235767. •CUDDAPAH ☎ 224445. •KARIMNAGAR ☎ 2234883. •WARANGAL ☎ 2578946. •MIRYALGUDA ☎ 230130.**

కార్టూన్ కదంబం


ఇదే.. మా ఎన్నికల ఎజెండాలో ఉంది బ్రదర్!!
బిజేపి

కోటివరాలు
1
2


ఎన్నికల ఆఫర్
రేషన్‌కార్డులు
గృహనిర్మాణం
బిందు సేద్యం
మరుగుదొడ్లు
ఆదరణ
బాలికా సంరక్షణ
నూరుశాతం


ఓటు ప్లీజ్!!
ముందస్తు ఎన్నికలు వస్తే?

పూలరంగడు!

ఈ ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తుపట్టారా? ఈయన మనదేశ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి. దేశంలో ఉన్నపుడు ఫక్తు భారతీయుడిలా సంప్రదాయ దుస్తుల్లో దర్శనమిచ్చే ప్రధాని విదేశాలకు వెళ్ళినపుడు మాత్రం రంగు రంగుల, అధునాతన, అతిఖరీదైన దుస్తులు, సూట్లు ధరిస్తారు. ఇటీవల ఆగ్నేయాసియా దేశాల సదస్సు నిమిత్తం వాజ్‌పేయి బాలి దేశం వెళ్ళారు. అక్కడకు వెళ్ళాక వారి దుస్తులు నచ్చాయేమో వారు సంప్రదాయంగా వేసుకునే రంగు రంగుల పూల చొక్కా ధరించి దర్శనమిచ్చారు.



మత సామరస్యానికి ప్రతీక

హిందవామాల్కోట్ గ్రామం రాజస్థాన్‌లో సరిహద్దుకు 20 కిలోమీటర్ల ఇవతల ఉంది. దేశవిభజనకు ముందు ముస్లిం మెజారిటీగా గల ఆ గ్రామంలో 10 దర్గాలున్నాయి. ప్రస్తుతం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్‌ఖాన్ మినహా ముస్లింలెవరూ ఆ గ్రామంలో లేరు. అంతా హిందువులే. అయితే రెండు నెలలకోసారి పది దర్గాల్లోనూ మేళాలు ఘనంగా జరుగుతాయి. నిత్యం ప్రార్థనలు జరుగుతాయి. వాటి పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా పవిత్రంగా ఉంటాయి. ఇదంతా చేసేది ముస్లింలు కాదు గ్రామంలోని హిందువులే. మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న ఈ గ్రామం గురించి మోడీకి, అశోక్‌సింఘాల్‌కు చెబితే !

వి.వి.ఐ.పితో ఆటలా?

పెళ్ళి కొడుకైనంత మాత్రాన వి.వి.ఐ.పితో ఆటలాడతారా? అదీ బ్లాక్ కేట్ కమాండోస్ కళ్ళెదుట? ఉత్తరాదిన పెళ్ళి సందడి ఎక్కువ. ధనవంతుల ఇంట పెళ్ళి అయితే ఇక చెప్పేదేముంది? మొన్నీమధ్యన ఢిల్లీలో దేశ ఉపప్రధాని లాల్‌కిషన్ అద్వానీ గారి అబ్బాయి జయంత్ అద్వానీ పెళ్ళయింది. కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, రాజకీయ ప్రముఖులు, అధికారులతో కళ్యాణమంటపం కళకళలాడుతోంది. పెళ్ళి వేడుకల్లో భాగంగా వారి సాంప్రదాయం ప్రకారం వధువు స్నేహితురాళ్ళు వరుడి బూట్లు అపహరించి దాచిపెట్టారు. అవి ఎక్కడున్నాయో వరుడే వెతుక్కోవాలి. పెళ్ళిలో ఇదొక ఆట. సాధారణ కుటుంబీకుల పెళ్ళి అయితే ఈ కార్యక్రమం ఆద్యంతం రసవత్తరంగా జరుగుతుంది. అందరూ సరదాగా కాలక్షేపం చేస్తారు. మరి ఇక్కడ పెళ్ళి కొడుకు ఉప ప్రధాని గారి కొడుకాయే. అందుకే బ్లాక్ కేట్ కమాండోస్ రంగంలోకి దిగారు. జయంత్ అద్వానీ వెతకడానికి వీల్లేదు, మేమే వెతికి తెస్తాం అంటూ తలా ఒక దిక్కుకు వెళ్ళి పెళ్ళి మంటపం అంతా శోధించి బూట్లు తెచ్చి ఇచ్చారు. ఈ నల్లపిల్లుల హడావిడితో ఆట ఆగమై పెళ్ళి కూతురి స్నేహితురాండ్రు చాలా చికాకుపడ్డారుట;!

ఓరా!



ఈశాన్యాన ఎలుకలతో యుద్ధం!

దేశ ఈశాన్య రాష్ట్రాలలో ఒక అసాధారణ యుద్ధం జరగబోతోంది. ఆ యుద్ధం ఉగ్రవాదులతోనో, శత్రువులతోనో కాదు. వెదురుపూల వల్ల పేట్రేగిపోయే ఎలుకలు, చెదలతో. ఈ యుద్ధంలో ప్రభుత్వం విఫలమైందా ఈశాన్యాన కరువు తప్పదు. అదెలాగంటే, భారతదేశంలో కోటి హెక్టార్లలో విస్తరించిఉన్న వెదురువనాలకు 25 సంవత్సరాలకోసారి వసంతం వచ్చి పూలుపూస్తాయి. పూలు వికసించడంతోటే ఆ చెట్టు ఎండిపోయి కూలిపోతుంది. మనకు ఎంతో ఉపయోగపడే అటవీసంపద ఎందుకూకొరగాకుండా పోవడమే గాకుండా అడవుల్లో గుట్టలుగా ఇవి కూలిపోతే వాటికింద చెదలు, ఎలుకలు విచ్చలవిడిగా పెరిగిపోయి అడవులను, అక్కడి గ్రామాల్లోని పొలాలను కూడా దుంప నాశనం చేస్తాయి. 1978లో ఇదే జరిగింది. అపుడు వెతికి వెతికి 25 లక్షల ఎలుకలను చంపారు. వెదురువనాలు ప్రధానంగా ఈశాన్యరాష్ట్రాల్లోనే 18,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. అస్సాం, త్రిపుర, మిజోరాం, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల్లోని వెదురుఅడవులు ప్రధానంగా ఈ ప్రమాదాన్ని ఎదుర్కోనున్నాయి. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ అందించిన సమాచారం మేరకు 2004 నుండి 2007 వరకు దేశంలో వెదురువనాలు పుష్పించేదశకు చేరుకుంటాయి. అయితే చాలాచోట్ల ఇప్పటికే ఈ దశ ప్రారంభమైనట్లు వార్తలు అందుతున్నాయి. అందుకే వెదురు వనాలు పుష్పించే దశకు రాకముందే వాటిని నరికివేసి రాబోయే ఉత్పాతాన్ని నివారించాలని కేంద్ర ప్రభుత్వం ఆరాటపడుతోందని అటవీశాఖ మంత్రి సి.పి. ఠాకూర్ ప్రకటించారు. ముందుగా నరికి రవాణా చేసేస్తే అటవీసంపద వల్ల వచ్చే ఆదాయం పొందడమే గాకుండా, అవి కూలిపోయినందువల్ల పెరిగే చెదలు, ఎలుకల ఉత్పత్తికి అడ్డుకట్ట వేసినట్లే. అతికొద్ది కాలంలో యుద్ధప్రాతిపదికన 2.5 కోట్ల టన్నుల వెదురును నరికి రవాణా చేయాలి. ఇందుకు కొన్ని న్యాయపరమైన చిక్కులు కూడా ఉన్నాయంటున్నారు. వీటన్నింటినీ అధిగమించి కేంద్రం ఈశాన్య రాష్ట్రాలను ఎలుకలు భోంచేయకుండా రాబోయే ఉత్పాతాన్ని అరికట్టగలదో లేదో చూద్దాం.

✻ ఇ.వి.బాలాజీ



కరుణామయి మదర్ థెరిస్సా

ఆమె ఆజానుబాహువు కాదు చాలా పీలగా ఉంటారు, ముఖమంతా ముడుతలు పడి ఉంటుంది. అయితే ఆమెది వజ్రసంకల్పం. అనుకున్న కార్యం అయ్యేవరకు వదలరు. సమాజం వెలివేసిన కుష్టు రోగులు, అనాథలు, రోగులు, దీనులు ఆమెకు ఆప్తులు. ఆమె తిరగని దేశం లేదు. ఆమె కార్యకలాపాలు, సేవలు అందుకోని దేశ ప్రజలు లేరు. ఆమెను కలుసుకోని దేశాధినేతలు లేరు. ఆమే మదర్ థెరిస్సా. ఇటీవలే "మహిమాన్వితురాలు"గా గుర్తింపు పొందింది. కాని అంతకు మించి దీనజనోద్ధారకురాలిగా ఆమె ప్రజల మన్ననలను పొందింది. మానవసేవే మాధవసేవ అని త్రికరణశుద్ధిగా నమ్మి జీవితమంతా రోగులు, అనాథల సేవలో గడిపి తరించిన మాతృమూర్తి. ఎక్కడో ఐరోపాలోని అల్బేనియాలో పుట్టి భారత గడ్డపై కాలు మోపి కలకత్తాలోని పేదలు, రోగులు, అనాథలకు సేవ చేస్తూ తన కార్యకలాపాలను ప్రపంచమంతటికీ విస్తరింపచేశారు.

భారతదేశంలో తొలిసారిగా పద్మశ్రీ బిరుదు పొందిన విదేశీమహిళ మదర్ థెరిస్సా. 1947లో దేశానికి స్వాతంత్రం రాగానే ఆమె భారత పౌరసత్వం తీసుకున్నారు. అప్పటినుండీ నూటికి నూరుపాళ్ళు భారత మహిళగానే గడిపారు. భారతరత్న అందుకున్న తొలి విదేశీమహిళ కూడా ఆమే. అలాగే నోబెల్ శాంతిబహుమతి వంటి ప్రపంచంలో అనేక అత్యున్నత అవార్డులు, బిరుదులు పొందారు. ప్రపంచంలో మదర్‌థెరిస్సా పొందినటువంటి బిరుదులు, అవార్డులు, సత్కారాలు మరే సంఘసేవికా పొందలేదనడంలో సందేహం లేదు.

ప్రపంచంలోని క్రైస్తవులకు అత్యున్నత పీఠమైన వాటికన్ పోప్‌జాన్‌పాల్ ఆదివారం నాడు ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన రెండున్నర లక్షల మంది క్రైస్తవుల సమక్షంలో మదర్‌థెరిస్సాకు

దివంగత ప్రధాని ఇందిరాగాంధీతో...

బీటిఫికేషన్ ప్రకటించారు. ఆమెను దేవదూత(సెయింట్)గా ప్రకటించడానికి ముందస్తు ప్రక్రియ పూర్తి చేశారు.

రోగుల హృదయాల్లోనే క్రీస్తు ఉంటాడని త్రికరణశుద్ధిగా విశ్వసించిన మదర్‌థెరిస్సా 18వ ఏట నన్ (క్రైస్తవ సన్యాసిని)గా మారి తన జీవితాన్నంతా సమాజంలోని రోగులు, దీనులు, అనాధల సేవలో గడిపారు. మతం ఏదైనా వారు దీనులు, రోగులు అయితే చాలు మదర్ ప్రేమకు పాత్రులయ్యేవారు. ఆమె ప్రేమకు ఎల్లలు లేవు. అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ అయినా ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అయినా మదర్‌కు ఇంటర్వ్యూ ఇవ్వాల్సిందే. అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్న దేశమైనా, ఇతర దేశాలపై కాలుదువ్వే దుండగ దేశమైనా, నియంత పాలనైనా, మత దేశమైనా మదర్‌థెరిస్సా మిషనరీస్ ఆఫ్ చారిటీ కార్యకలాపాలను అడ్డుకోవడానికి వీల్లేదు. ఆమెది ఎల్లలెరుగని విశ్వమానవ ప్రేమ.

1910 ఆగస్టు 26న యుగోస్లావియాలోని స్కోప్జి పట్టణంలో జన్మించిన మదర్ థెరిస్సా అసలు పేరు మేరి థెరిస్సా బొజాక్సియో. ఆనాడు యుగోస్లావియా ఆల్బేనియా రాజ్యంలో భాగంగా ఉండేది. వ్యాపారం చేసే థెరిస్సా తండ్రి ఆమె ఏడో ఏటనే మరణించారు. చిన్ననాటి నుండి దైవారాధనకు ప్రాధాన్యత నిచ్చే థెరిస్సా పేదలపట్ల ఎంతో దయగా ప్రవర్తించేవారు. ఆ దృక్పథంతోనే 18వ ఏట నన్‌గా మారి, పేదలకు సేవ చేయడం కోసం ఆనాడే ఇల్లు వదిలారు. 1928 నవంబర్‌లో భారత్‌కు పయనమైన థెరిస్సా 1929 జనవరిలో కలకత్తాలో అడుగుపెట్టారు. డార్జిలింగ్‌లో కొంతకాలం గడిపిన తర్వాత తిరిగి కలకత్తా చేరుకుని నగర శివారులోని సెయింట్ మేరీ స్కూల్‌లో టీచర్‌గా చేరారు. 1937లో ఆ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. కలకత్తా వచ్చిన వెంటనే బెంగాలీ భాషను నేర్చుకున్నారు. అచ్చమైన భారతీయ వనితగా తనను తాను మార్చుకున్నారు. 1942లో రెండో ప్రపంచ యుద్ధం జరిగే సమయాన బెంగాల్‌ను భయంకర కరువు కాటేసింది. కరువుకోరల్లో చిక్కి 20 లక్షల మంది చనిపోయినట్లు ప్రభుత్వమే ప్రకటించింది. ఇక ఆనాటి నుండి పేదలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలిగా మోతీఝుల్‌లో పేద పిల్లలకు ఒక బడి నడపాలని నిర్ణయించుకున్నారు. ఆ వాడలన్నీ తిరిగి పిల్లలను బడిలో చేర్చవలసిందిగా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మెల్లగా పిల్లలు చేరడం మొదలైన తర్వాత దాన్ని నడపడం కష్టమైంది. ప్రభుత్వ సాయం కోరగా ఏడాది నడిపిన తర్వాత గాని నిధులు మంజూరు చేయలేమని అధికారులు తేల్చిచెప్పారు. ఏడాది

బ్రిటిష్ యువరాజు ప్రిన్స్ చార్లెస్‌తో

మదర్ పొందిన అవార్డులు



పోప్‌జాన్ పాల్ అవార్డు బహుకరణ దృశ్యం



ఆనాటి రాష్ట్రపతి సంజీవరెడ్డి నుండి భారతరత్న అందుకుంటూ

1963లో ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.

మెగసెసె అవార్డు, పోప్‌జాన్‌పాల్ అవార్డు, జోసెఫ్ కెన్నెడీ అవార్డు అందుకున్నారు.

ఇంగ్లాండ్ మహారాణి క్వీన్ ఎలిజబెత్ నుండి ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు అందుకున్నారు.

నోబెల్ శాంతి బహుమతి స్వీకరిస్తూ

1979లో ఆమెకు నోబెల్ శాంతి బహుమతి బహూకరించారు.

భారతరత్న అవార్డు పొందారు.

ప్రపంచంలో ఏ సంఘసేవికా మదర్‌థెరిస్సా పొందినన్ని అవార్డులు, సన్మానాలు పొందలేదు.

బీటిఫికేషన్ అంటే?



క్రైస్తవులలో జీవితమంతా మానవ సేవకే అంకితం చేసి ప్రపంచానికి ఆదర్శంగా జీవించి తనువు చాలించిన వారికి, మహిమలున్నాయని ప్రజలు విశ్వసించినవారికి బీటిఫికేషన్ చేస్తారు. మదర్‌థెరిస్సా అందించిన సేవలకు గుర్తింపుగా ప్రపంచ క్రైస్తవులకు అత్యున్నత పీఠమైన వాటికన్ పోప్ జాన్‌పాల్ టూ బీటిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. బీటిఫికేషన్ ప్రకటించాలంటే ఆ వ్యక్తి గురించి, శక్తిసంపన్నత గురించి ఎవరైనా సాక్ష్యాలతో రుజువు చేయాలి. కోల్‌కతాకు చెందిన మోనికా బెస్రా ఇచ్చిన సాక్ష్యంతో వాటికన్ సంతృప్తి చెంది మదర్‌కు బీటిఫికేషన్ ఇవ్వడానికి సంకల్పించి నిర్వహించింది. తర్వాతి దశలో దేవదూత బిరుదును ప్రదానం చేస్తారు. ప్రపంచంలో ఇంతవరకు 1314 మందికి వాటికన్ పీఠం బీటిఫికేషన్ ప్రకటించింది.

తర్వాత చెప్పిన విధంగా ప్రభుత్వం ఆ బడికి నిధులు మంజూరుచేసింది. క్రమంగా నగరంలోని అనేక ప్రాంతాల్లోని మురికివాడల్లో థెరిస్సా ఆధ్వర్యంలో పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

తొలిసారిగా 1960లో కలకత్తా వెలుపల రాంచీలో థెరిస్సా విద్యాలయాల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రారంభమయ్యాక దేశం నలుమూలలా సంస్థ కార్యకలాపాలు విస్తరించాయి. మదర్ థెరిస్సా సేవాగుణం, కార్యదీక్ష, పట్టుదల ప్రపంచదేశాల్లో ప్రాచుర్యం పొందింది. విరాళాలు కూడా రావడం ఆరంభమైంది. 1960లో రాంచీలోని థెరిస్సా విద్యా, సేవ కార్యాలయం ప్రారంభించిన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆమె సేవా తత్పరతను గుర్తించి 1962లో పద్మశ్రీ అవార్డుకు ఆమె పేరును సిఫార్సు చేశారు. ప్రధానంగా కుష్ఠురోగులు, అనాధ పిల్లలు, మహిళలు, వృద్ధులను ఆమె చేరదీసేవారు. మురికివాడల్లోని పిల్లలకు బడులు ప్రారంభించేవారు.

మదర్ సేవాగుణం చూసిన అనేక దేశాల్లోని క్రైస్తవ మిషనరీలు ఆమెను ఆహ్వానించాయి. 1965లో బయటి దేశాల్లో కార్యకలాపాలు మొదలయ్యాయి. 1988లో ప్రపంచ క్రైస్తవ అత్యున్నత పీఠం ఉన్న వాటికన్ సిటీలోని పేదలకు మదర్ ఛారిటీ సేవలు మొదలయ్యాయి. 1991 నాటికి మదర్ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ కార్యకలాపాలు 168 దేశాలకు విస్తరించాయి. దేశంలోనూ, విదేశాల్లోనూ కుష్ఠు రోగుల సేవల నిమిత్తం ఆమె ప్రత్యేకంగా కేంద్రాలు స్థాపించారు. ఇళ్ళలోనూ, ఆస్పత్రుల్లోనూ వారిని ఛీదరించుకోవడం, వైద్యం అందించకపోవడం వంటి దుర్మార్గాలు ఆమెను కలచివేశాయి. అందుకే వారికి సేవ చేయడానికి, వారి జీవిత చరమాంకం ప్రశాంతంగా గడిచిపోవడానికి ప్రత్యేకంగా కేంద్రాలు ప్రారంభించారు. ప్రస్తుతం 4 లక్షల మంది కార్యకర్తలు ప్రపంచవ్యాప్తంగా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ తరపున సేవలు అందిస్తున్నారు.

మదర్ నిరాడంబరత, సేవాతత్పరతకు

సింధియాతో

దేశదేశాల అధినేతలు లొంగిపోయారు. ఆమెను తమ దేశానికి ఆహ్వానించి, సేవా కార్యక్రమాలు ప్రారంభించవలసిందిగా కోరారు. కొన్ని దేశాలలో తమ కార్యక్రమాలు ప్రారంభించడానికి మదర్ స్వయంగా ఆయా దేశాల నేతలతో సంప్రదించారు. 1991లో ఇరాక్‌పై అమెరికా జరిపిన దాడిని ఆపవలసిందిగా ఆనాటి అమెరికా అధ్యక్షుడు సీనియర్ బుష్‌కు లేఖ రాసారు. యుద్ధ పరిస్థితులను నివారించాలని ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌కు కూడా రాసారు. అమెరికా దురాక్రమణ దాడి పూర్తి అయిన అనంతరం ఇరాక్‌లోని క్షతగాత్రులు, పేదలు, పిల్లలకు సేవ చేయడానికి ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సద్దాం హుస్సేన్ మదర్ ఆధ్వర్యంలోని ఛారిటీస్‌కు అనుమతించాడు.

మతం మత్తుమందు వంటిదని కారల్‌మార్క్స్ చెప్పిన సూక్తిని మన దేశంలోని కాషాయపరివారం రుజువు చేస్తోంది. అయితే మతాలకు అతీతంగా మదర్ థెరిస్సా చేసిన సేవలు, తన జీవితాన్ని రోగులు, అనాధలకు అంకితం చేసిన ఆమె త్యాగనిరతికి స్పందించిన ప్రపంచమంతా మదర్‌కు నివాళులు అర్పిస్తోంది. 1997 సెప్టెంబర్ 5న మదర్ తుదిశ్వాస విడిచారు. ●


కుష్ఠురోగుల సేవలో...

✻ శిరంశెట్టి కాంతారావు

చలిచీమలు



మునేరు ఇసుక తిన్నెలు పున్నమి వెన్నెల్లో బూరుగుదూది పరుపులా ప్రేక్షకులకు ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ పంచుతుంటే కూర్చొని తమను తామే మర్చిపొయ్యి బుర్రకథలో లీనమయ్యారు.

ఒక్క సాయిలు తప్ప.

సాయిలుకి అరవై ఏండ్లుంటాయి. నల్లగా బలంగా ఉంటాడు. ఆ ఒంటిమీద తుండుగుడ్డ తప్ప చొక్కా ఉండదు. భుజానికి ఎప్పుడూ 'దప్పు' వేళాడుతుంటుంది.

"అయ్యా! ఇంటి దగ్గర ఎట్టుందో పోదాం ఫా" అంటు మాటిమాటికి తన పదేండ్ల మనవడు తిరుపతిని బుజ్జగించసాగాడు.

"హేఁనీయవ్వ! పోదాం ఉండవే" అంటు బుర్ర కథలో లీనమైన తిరుపతి తాతను లేవనివ్వటం లేదు.

మునేరు ఒడ్డున ఉన్న పెద్దమ్మ గుడిలో ఆ పున్నమి నుండి పదిహేను రోజుల జాతర జరుగుతుంది. ఈ పదిహేను రోజులు ఏటి ఇసుకలో ఏర్పాటు చేసిన స్టేజీ మీద ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం జరుగుతుంది. మునేరు జనంతో పోటెత్తుతుంది.

ఆ జాతరలో లెక్కలేనన్ని కోళ్ళు, మేకలు తెగిపడతాయి.

కాపు సారా ఏరులై పారుతుంది.

మునేరు ఒడ్డు వెంట తుప్పల్లో సారా బట్టీలు మూడొందల అరవై రోజులూ నడుస్తూనే ఉంటాయి. అవి అన్నీ సారా దాసు సొంతం.

సదరు సారాదాసు మీద కానీ, అతని మనుషుల మీద కానీ ఏ అధికారీ చర్య తీసుకోడు. వాళ్ళ మీద ఎక్కడా ఒక్క కేసూ ఫైల్ కాదు. అతని వెనుక అన్ని రాజకీయ పార్టీల నాయకులుంటారు. వాళ్ళకు ఏ అవసరమొచ్చినా సారాదాస్ ఆదుకుంటాడు. ఆ విధంగా మునేరు అతని వ్యాపార కేంద్రంగా విలసిల్లుతోంది. అక్కడి నుండి రాష్ట్రం నాలుగు మూలలా సారా సరఫరా జరుగుతుంది.

కాపుసారాను పరిశ్రమ స్థాయిలో నడుపుతున్న సారాదాసు బట్టీల్లో మునేరు ఒడ్డెమ్మటి ఊళ్ళల్లోన్ని ఎంతోమంది యువకులు వ్యవసాయాలు వదిలేసి, పనిపాటలు మానేసి, కూలీ నాలీలు కూడా విడిచిపెట్టి పని వాళ్ళుగా చేరిపొయ్యారు. ఇరవై నాలుగ్గంటలు బట్టీల దగ్గరే పని చేయడం, ఫూట్‌గా తాగి పడిపోవడం.

గుర్తొచ్చినప్పుడు ఇండ్ల కొచ్చి తల్లిదండ్రులతోనూ, భార్యా పిల్లలతోనూ ఏదో ఒక గొడవ పడేవాళ్ళు ఎక్కడ చూసినా కన్పిస్తూనే ఉంటారు. సాలె గూట్లో ఈగల్లా సారాదాస్ విషవలయంలో చిక్కుకుపొయ్యారు.

సాయిలు కొడుకు మల్లేష్ కూడా సారాదాసు సారాకు దాసుడై బట్టీల్లోనే ఉంటూ ఏ అర్ధరాత్రో, అపరాత్రో వచ్చి తాగిన మత్తులో భార్యను విచక్షణ లేకుండా కొడుతుంటాడు.

ఇదంతా గుర్తుకొచ్చిన సాయిలు తాగొచ్చిన కొడుకు ఇంట్లో ఏం చేస్తున్నాడోనని కంగారు పడుతూ మనవణ్ణి తడవకోసారి "పోదాం, పోదాం" అంటున్నాడు.

సాయిలు ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి దాకా పెద్దమ్మ గుడి దగ్గరే ఉంటాడు.

గుడికొచ్చే భక్తులంతా 'దప్పు' చప్పుళ్ళతోనే అమ్మవారికి ప్రసాదాలు సమర్పిస్తుంటారు. అందుకే సాయిలు ఎప్పుడూ ఆ గుడి దగ్గరే ఉంటాడు. తన ఊహ తెలిసినప్పటి నుండి అతను ఆ దప్పు మీదనే ఆధారపడి బతుకుతున్నాడు.

అతని చేతిలో దప్పు సప్తస్వరాలు పలుకుతుంది.

తన చేతివేళ్ళు దప్పు మీద నాగుపాము నాలుకల్లా కదులుతుంటాయి.

అతని 'దప్పు' దరువు సాగిపోయే మునేరు ఆగిపోయి వింటుంది.

ఆ చుట్టుపక్కల ఊళ్ళల్లో అతని 'దప్పు' దరువుకి తలఊపని వాళ్ళు ఉంటారంటే ఎవ్వరూ

ఒప్పుకోరు.

కొడుకు చిన్నప్పుడే సాయిలు భార్య చనిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా కొడుకును "చేతిలో వెన్నపూస"లా సాదుకున్నాడు.

కోడలు బుద్ధిమంతురాలు. మామను తండ్రిలాగా చూసుకుంటుంది. తనకి 'తిరుపతి' తరువాత ముగ్గురు పిల్లలు పురిట్లోనే పొయ్యారు. మళ్ళీ ఇప్పుడు నిండు నెలల గర్భిణి.

అందుకే ఆ మనుమడంటే తాతకు ప్రాణం. కోడలంటే అభిమానం.

'బుర్రకథ' అయిపోయింది.

మనవడితో కలిసి మునేటి ఆవలి గట్టున ఉన్న గూడేనికి బయలుదేరాడు సాయిలు.

మునేటి నీటిలో పూర్ణ చంద్రుడు, తారకలతో కలిసి జలకాలాడుతున్నాడు.

దూరంగా సారా బట్టీల మంటలు ఊరి శవం తలాపు పెట్టిన దీపంలా కాలుతున్నాయి.

ఆ మంటల్ని చూసిన సాయిలు "ఆటిల్లో ఇంకెంత మంది బతుకులు బుగ్గవ్వాలో?!" అనుకుంటూ మనవణ్ణి భుజం మీద కూర్చోబెట్టుకొని నీళ్ళల్లో దిగాడు.

చందమామ చేవలు చవితి నాటి నెలవంకలా చెంగున నీళ్ళల్లో నుండి పైకి ఎగిరి దూకుతున్నాయి.

నీళ్ళల్లో కదులుతున్న అతని పాదాలను ఏవో గుర్తు తెలియని చేప పిల్లలు ఆహారం అనుకొని సనసన్నగా కితకితలు పెట్టినట్టు కొరకసాగాయి.

ఇవేవీ పట్టించుకోని సాయిలు పెద్ద పెద్ద అంగలతో, జారుతున్న 'డప్పు'ను పైకి ఎగదోసుకుంటు గూడేనికేసి కదులుతున్నాడు.

ఏరుదాటి ఒడ్డెక్కుతున్న సాయిలుకి గూడెంలో నుండి లీలగా ఏదో గోల చెవిన పడింది.

భుజం మీద కూర్చున్న మనుమడు కళ్ళు మూతలు పడుతుంటే తాత మెడకు కాళ్ళతో కత్తెర వేసి, రెండు చేతులతో అతని తల గట్టిగా పట్టుకొన్నాడు.

గూడెం దగ్గరవుతుంటే గోల పెద్దదవుతోంది.

"ఏ తాగుబోతెదవో తాగొచ్చి ఏ ఇల్లాల్నో ఉసురు పెట్టుకుంటుండు" అనుకుంటూ ఇంకా గూడెం దగ్గరకొచ్చిన సాయిలు" అరే! ఆ గోలేందో మా ఇంటికెల్లి నుంచే వస్తుందిగా!? అనుకొని భయంభయంగానే గుడిసె దగ్గరకు చేరుకున్నాడు.

"సాయిలు మావా! దా!దా! నీ కోసమే సూస్తున్నం. మల్లిగాడు తాగొచ్చి పోర్ని సావగొట్టిండు" అంటూ పక్కింటతను ఎదురొచ్చాడు.

"మల్లేమైంది?" అంటు భుజం మీది మనవణ్ణి దించి, కింద పడి ఉన్న కోడలి దగ్గరకు పరుగెత్తికెళ్ళాడు. ఆమె స్పృహలేకుండా పడిపోయి బాధతో మెలికలు తిరుగుతోంది. ఆ దృశ్యాన్ని చూసిన సాయిలు ఘొల్లు మన్నాడు.

"కూర బాగలేదని తగాదా పెట్టుకొని బలంగా తోసిండు. ఆమె దర్వాజ మీద బొక్కబోర్ల పడింది. పిండానికి దెబ్బ తగిలిందో ఏమో?! సోయి సొరంతి లేకుండ పడిపోయింది!! పక్కింటతనే మళ్ళీ అన్నాడు.

అప్పటికప్పుడు నానా ఇబ్బందులు పడి ఇరుగు, పొరుగు సాయంతో ఏటవతల హాస్పిటల్‌కి కోడల్ని తీసుకుపొయ్యాడు సాయిలు.

ఇంత జరుగుతున్నా తాగిన మైకంలో ఏమీ పట్టని కొడుకు నట్టింట్లో నేలమీద ఒరిగాడు.

హాస్పిటల్ చేరేలోపే కడుపులో పిండం చనిపోయి, అసలే బలహీనంగా వున్న సాయిలు కోడలు మరికోలుకోలేక తాగుబోతు భర్తకు శాశ్వితంగా దూరమైంది.

తల్లిని కోల్పోయి ఏడుస్తున్న మనవడిని చేత పట్టుకొని శవాన్ని గూడెం చేర్చాడు సాయిలు.

ఇంటి దగ్గర రాత్రి నట్టింట్లో నేల మీద ఒరిగిన కొడుకు ఒరిగినట్లే ఉండటం చూసి ఏడ్చుకుంటూ దగ్గరకు వెళ్ళిన సాయిలు మల్లిగా! ఎంత పని జేస్తివిరా?! లచ్చిదేవి లాంటి ఇల్లాల్ని మింగి నీళ్ళు తాగితివి గదరా లం..కొడకా" అంటు కొడుకు చెయ్యి పట్టుకొని కరెంట్‌షాక్ కొట్టినట్టు ఉలిక్కి పడ్డాడు. మల్లీ! మల్లొర్రె!" అంటు చల్లగా నీలుక్కపోయిన కొడుకు



శరీరాన్ని పిచ్చిగా అటూ, ఇటూ కదుపుతూ పెద్దగా ఏడవసాగాడు.

"ఏందేందీ?!! అంటు బయట కోడలి శవం దగ్గర ఉన్న ఇరుగు, పొరుగు వాళ్ళు బిలబిలమంటా లోపలికొచ్చి చచ్చిపడున్న మల్లేష్‌ను చూసి అవాక్కైపోయారు.

'ఇట్లెట్టైంది?!" అనుకుంటూ అందరూ తర్జనబర్జన పడసాగారు.

"ఇండ్ల ఆలోసించేదేంది!? రాత్రి మనందరం ఆస్పత్రికి పోయినం గద! తాగి ఉన్నాడికి ఇన్ని నీల్లు కూడా ఇచ్చే నాథుడు లేక సొరం ఎండి సచ్చిపోయిండు గంతే" అంటు తేల్చేశాడు వాళ్ళల్లో ఓ ముసలాయన.

ఒకేసారి తల్లిని, తండ్రినీ పోగొట్టుకొని దీనంగా ఏడుస్తున్న తిరుపతిని చూసే వాళ్ళ గుండెలు నీరైపోతున్నాయి.

సాయిలు గుండె దుఃఖంతో ఘనీభవించి స్తబ్దతగా కూర్చుండిపొయ్యాడు.

"ఈ తాగుడు పాడుగాను, పతొక్క నాబట్టా తాగుడేనాయె. ఈ తాగుడెప్పుడు మొదలారి పోద్దో ఆ పెద్దమ్మ తల్లికే ఎరుక"

"మన బంగారం మంచిదైతే కంసలోన్ననేదేంది? ఒక్కొక్క నా కొడుకు బల్సి తాగుతుంటే మద్దెన ఆ తల్లేంజేస్తది."

"ఆ సారా దాసుగాడి పెండ్లం సేతిలో బెల్లం బెట్ట, వాడు సచ్చిందాక మన గతింతే"

"పోలిసోల్లు గూడ అన్ని ఏంజెయ్యలేకపోతుండ్రు."

"ఏంజేస్తర్?! పెద్ద పెద్ద ముండాకొడుకులందరు ఆడిపట్టేనాయె. అల్లకొచ్చేయి అల్లు మింగి నల్లంగ కూకుంటరు. ఆడిజోలికెందుకుపోతరు.

సాయిలు ఇంటి ముందుకొచ్చిన గూడెపోళ్ళందరూ ఎవరికి తోచినట్లు వాళ్ళు మాట్లాడసాగారు.

"ఈ పోసుకోలు మాటలన్ని ఇప్పుడెందుకుగాని, జరగాల్సింది సూడండి" అన్నాడో పెద్దమనిషి.

కాళ్ళ సందునతలపెట్టుక్కూర్చున్న సాయిలుతో "ఏంది? మావా! నువ్వే ఇట్ల గుండెసెడికూసుంటే ఆ సిన్ని పిల్లగాడు ఆగమైతడు. అల్లిద్దరికీ దేవుడట్ల రాసిండు. మనం ఏంజేస్తం సెప్పు! లే, లేసి, ఆ పిల్లగాన్ని సముదాయించు. జరిగే కార్యం జరిపించు" అంటు ఇంకో వ్యక్తి ధైర్యం చెప్పాడు.

"ఇంత అన్నాయం ఎక్కడ సూల్లే. మొగుడూ, పెండ్లం ఒక్కసారే సావటం. ఇరికిట్ల ఎంతమంది సావాల్నో"

"ఈసారా పాడుగాను ఇట్ల ఊళ్ళకి ఊళ్ళనే గత్తర మాదిరి మింగేస్తుంటే పట్టించుకొన్న దిక్కేలేకపాయె"

"గవర్నమెంటోడే తనతాన పైసల్లేవ్ తాగండి తలకు పోసుకోండి అన్నంక ఇంకెవర్నేదుకుతం", తలో మాటా మాట్లాడుతూనే శవాలను పాతిపెట్టడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మునేరు ఒడ్డుకి శవాలు బయలుదేర దీశారు.

శవాల ముందు 'డప్పు' పట్టుకొని కదిలిన సాయిలు తన దుఃఖాన్నంతా చేతి వేళ్ళ ద్వారా డప్పు మీద పలికిస్తూ వెంట నడుస్తున్న వాళ్ళు ఒళ్ళు జలదరించి పొయ్యేట్టు కొట్ట సాగాడు...

* * *

కొడుకూ, కోడలు పోయిన దుఃఖంలో ఉన్న సాయిలును ఊళ్ళో జరిగిన మరిన్ని చావులు అసహనానికి గురి చేశాయి. ఆలోచింపజేశాయి.

"ఆ సారాదాసుగాడి సారా యాపారం కుటుంబాలను నిలువునా ముంచెత్తుతోంది. ఇంకెంత మందిని పొట్టన బెట్టుకుంటడో? నా లెక్కే ఇంకెంతమంది ఏడవాలో? నాకెట్లాగు ఎవ్వరూ లేరు. ఉన్న ఒక్కడు మొగపిల్లగాడు వాడు ఎట్టయినా బత్కుతడు. సారాకాసుడు బందుజేయించాల. అందుకోసం సావనైన సావాల" అనుకున్న సాయిలు కార్యరంగంలోకి దూకాడు.

"డప్పు" తరతరాల అణచివేతకు, వివక్షతకూ ప్రతీక.

అదే డప్పు తిరుగుబాటుకూ, చైతన్యానికీ ప్రతీకే.

తన శరీరంలో భాగంగా మారి, తన సుఖాలకు, దుఃఖాలకూ సాక్షీభూతమైన ఆ డప్పునే ఆలంబనగా చేసుకొని చలీచీమలా సారాకు వ్యతిరేకంగా ప్రచారం మొదలు పెట్టాడు. ●

* పుప్పాల కృష్ణమూర్తి

బాలలకథ

నక్క జిత్తులు



అడవి దున్నలు కొన్ని పచ్చికలో మేస్తున్నాయి. అవి బలంగా ఆరోగ్యంగా వున్నాయి. వాటిని చూసిన ముసలి నక్కకు నోరూరింది. దూరంగా కూర్చుని వాటినే చూస్తూ గుటకలు మింగసాగింది. ఇంతలో రెండు తోడేళ్లు అటువైపు వచ్చాయి. అవి నక్క మీద దాడి చేయబోయాయి.

"ఆగండి మిత్రులారా! నన్ను చంపితే ఏం లాభం? నా దగ్గర బొక్కలు తప్ప మాంసం ఎక్కడన్నా కనబడుతోందా? మీకు ఒక్క పేగుకూడా నిండదు. మీరు క్షణం నిలబడితే మంచి ఆహారం చూపిస్తాను" అంది గుంటనక్క.

"ఆగాంగానీ విషయం ఏంటో చెప్పు" అన్నది ఆడ తోడేలు.

"అదుగో! అటు చూడండి. ఎన్ని దున్నపోతులున్నాయో! అవి కండపట్టి పుష్టిగా వున్నాయి. ఒక్కదాన్ని పట్టుకోగలిగినా ముగ్గురికీ కడుపునిండిపోతుంది" అంది.

"నీకంటే ముందే చూశాం. కాని అవి మనల్ని చూడగానే ఒక్కటైపోయి కొమ్ములతో పొడిచి చంపుతాయి. దగ్గరికి పోవడం కూడా ప్రమాదమే" అంది మగ తోడేలు.

"మీరు వెళితే ప్రమాదం. నేనంటే వాటికి భయం వుండదు. మీరు ఆ రాళ్ల చాటున నక్కి కూర్చోండి. నేను వెళ్లి ప్రయత్నిస్తాను" అంది. తన డొక్కు శరీరాన్ని ఈడ్చుకుంటూ మందవైపు వెళ్లింది. దాన్ని చూశాయి దున్నలు. ఒకటి ముందుకొచ్చి, "ఏంటే ముసలి నక్కా! రేపో, మాపో చచ్చేలాగున్నావు. మా మాంసం కావల్సి వచ్చిందా నీకు? కాలుపెట్టి ఒక్క తొక్కు తొక్కానో దెబ్బకు చస్తావ్" అంది బుసకొడుతూ.

"చచ్చేవరకూ బతకాల్సిందేగదయ్యా. ఈ పాడు దేహానికి రోజూ ఏదో ఒక మాంసం పడేయకుంటే ప్రాణాలు పోతాయిగదయ్యా. బతికినంత కాలం ఈ ఆహారపు అన్వేషణ తప్పదుగదయ్యా" అంది అతివినయంగా నక్క.

"అయితే మాలో ఎవర్ని వేటాడదామని వచ్చావు" అంది మరో కుర్రదున్న కోపంగా.

"ఎవరైనా ఫరవాలేదయ్యా. కావాల్సింది కాస్త మాంసమే గదయ్యా" అంది నక్క.

"నువ్వు మా మాంసం కోసమొస్తావంటే! అసలు నిన్ను కొమ్ముల్తో పొడిచి, గిట్టలతో తొక్కి చంపుతాను చూడు" అని ఆవేశంగా మీదకు వచ్చిందో పిల్లదున్న. నక్క దానికి అందకుండా దూరంగా పరిగెత్తింది. "అది. అట్లా వెళ్లిపో. మా దగ్గరకు వచ్చావో చస్తావు" అంది కుర్రదున్న. కానీ వెనక్కి తిరిగి దూరంగా వెళ్లినట్టు వెళ్లి మళ్లీ తిరిగి వచ్చింది నక్క.

"ఏంటీ...మళ్లీ వచ్చావు? తమాషాగా వుందా చెబుతుంటే? ఈసారి నిన్ను వదిలిపెట్టను" అని వెనకా ముందు ఆలోచించకుండా వెంటబడింది దున్నపిల్ల. నక్క పరిగెత్తుతూ, అందినట్టే అంది, అందకుండా పరిగెత్తుతూ, కవ్విస్తూ ముందుకు పరిగెత్తింది. నక్క వెంట అలా ఒంటరిగా వెళ్లొద్దని మిగతా దున్నలు వారించాయి. అయినా వినకుండా దాన్ని పొడిచి చంపాలని, కోపంతో వెనకాలే పరిగెత్తింది. నక్క సరాసరి రాళ్ల మధ్యకు పరిగెత్తింది. దున్న దగ్గరికి రాగానే అమాంతం రెండు తోడేళ్లూ మీదపడి గొంతుపట్టి, అరవకుండా కొరికి చంపాయి. తర్వాత దాని మాంసాన్ని మూడూ తనివి తీరా తిన్నాయి. 'ఛీ! నాకు తగినశాస్తి జరిగింది. కలిసి వుంటేనే బలం. విడిపోతే ప్రాణాలకే చేటు' అనుకుంది దున్నపిల్ల బాధగా. ●



చిన్నారి చిత్రకారులు



సిహెచ్.హరీష్,
8వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్,
చినకాకాని.

ఎస్.విజయ్‌కుమార్,
ప్రగతి విద్యాలయం,
తాడేపల్లి, గుంటూరు.

వై.గణేష్,
4వ తరగతి,
ఆంధ్రాపబ్లిక్‌స్కూల్,
విశాఖ.

షేక్ ఫర్‌జానా, 4వ తరగతి,
ఆల్టర్‌నేటివ్ ఉర్దూ మీడియం
ప్రాథమిక పాఠశాల,
మెదక్.

క్విజ్-80

1. 'గీతాంజలి' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ. రవీంద్రనాథ్‌ఠాగూర్ బి. బకించంద్రచటర్జీ
2. 'విండ్‌సిటీ' అని దేనిని పిలుస్తారు?
   ఎ. రోమ్ బి. చికాగో
3. ఫ్రాన్స్ జాతీయ చిహ్నము?
   ఎ.గులాబీ బి. లిల్లీ
4. అతి పొడవైన జంతువు?
   ఎ. జీబ్రా బి. జిరాఫీ
5. త్రిభుజములో ఎన్ని కోణాలు వుంటాయి?
   ఎ. 3 బి. 4
6. మహానదిపై నిర్మించిన ప్రాజెక్టు?
   ఎ. హీరాకుడ్ బి. వంశధార
7. పీఠభూమికి గల మరో పేరు?
   ఎ.టేబుల్‌ల్యాండ్ బి. ఐలాండ్
8. చంద్రుడు ఏ రోజున పూర్తిగా కనిపిస్తాడు?
   ఎ.పౌర్ణమి
   బి.అమావాస్య
9. నవరత్నములు వీరి ఆస్థానములోని కవులు?
   ఎ. రెండవ చంద్రగుప్తుడు
   బి. కృష్ణదేవరాయలు
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?
   ఎ. యాంగ్ ల్యూయీ
   బి. యూరీగగారిన్

పట్టుకోండి చూద్దాం

ఒక చేత్తో వదిలిన పోస్టు కార్డుని రెండో చేత్తో పట్టుకోవడం మనకి చాలా సులభం. అయితే మీరు వదిలిన కార్డుని వేరే వాళ్లు పట్టుకోవడమే కష్టం. అదెలాగో చూద్దామా...

పక్కన బొమ్మలో చూపించినట్లుగా మీ ఎడమచేతితో ఒక పోస్టుకార్డుని పట్టుకోండి. ఎడమచేయి కిందికి వదిలిన కార్డుని పట్టుకోవడానికి కుడి చేతిని సిద్ధంగా వుంచండి. కానీ వేళ్లు దానికి తగలకూడదు. ఇప్పుడు కార్డుని వదలండి. అరే.. కార్డుని భలేగా పట్టుకున్నారే.



ఈ సారి మీరు పోస్టుకార్డుని వదిలి మీ స్నేహితుడిని పట్టుకోమని చెప్పండి. ఇప్పుడు పోస్టుకార్డును వదలండి. అతని వేళ్లు దానిని పట్టుకోలేవు. అలా పోస్టుకార్డుని ఎన్నిసార్లయినా వదలండి. అతను దాన్ని పడిపోకుండా పట్టుకోలేడు.

మేజిక్! మేజిక్!

'ఇలా ఎందుకు జరుగుతుందా' అని ఆలోచిస్తున్నారా? నాకు తెలుసు మీకు ఆ అనుమానం వస్తుందని. మీ మెదడు ఒకే క్షణంలో మీ రెండు చేతులకూ "వదలండి", "పట్టుకోండి" అనే సంకేతాలను పంపగలదు. కనుక మీరు పోస్టుకార్డును పట్టుకోగలరు. కానీ మీ ఫ్రెండు అలా పట్టుకోవడానికి అతని మెదడు ముందుగా పోస్టుకార్డుని పడటం చూడాలి. అప్పుడు "పట్టుకోండి" అనే సందేశాన్ని అతని వేళ్లకు పంపాలి. దీనికి ఎక్కువ కాలం పడుతుంది. అందువల్లనే మీ మిత్రుడు దాన్ని పట్టుకోలేడు. అదన్నమాట సంగతి. వచ్చేవారం ఇంకో కొత్త మేజిక్ గురించి తెలుసుకుందామే.

రంగులు అద్దుతారా!



క్విజ్ 79 జవాబులు

1. 99 2. 1/4 3. థార్ 4.భారత్ 5. టంగుటూరి ప్రకాశం 6.ఊలెన్ 7. గ్రీస్ 8. ప్రేమ్‌చంద్ 9. షిరిన్ ఎబాదీ 10. అంజూ జార్జ్.

క్విజ్ 78కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎస్.సుధాకర్, 7వ తరగతి, ఎస్ఎమ్‌టి కాలనీ, ఎమ్మిగనూరు. **కీర్తి రాజేష్**, 10వ తరగతి, సనత్‌నగర్, విశాఖపట్నం. **ఎస్‌కె. కరీముల్లా**, 9వ తరగతి, విద్యానగర్, గుంటూరు. **పి.విమల**, 9వ తరగతి, పాత గాజువాక, విశాఖ. **జి.విష్ణుకుమార్**, 7వ తరగతి, **జి.కరుణాకర్**, 7వ తరగతి, **ఎల్.విజయకుమారి**, 8వ తరగతి, విశాఖపట్నం.

కలం స్నేహం

పేరు: జి.చేతన,
వయసు : 7 సం॥
చదువు : 2వతరగతి
హాబీలు : కథల పుస్తకాలు చదవడం, బొమ్మలు వేయడం, ఆడుకోవడం, కార్టూన్లు చూడడం.
పూర్తి చిరునామా : జి.చేతన, ఎస్ఆర్‌టి-13, సనత్‌నగర్, హైదరాబాదు.

పేరు: పడాల అనిల్ కుమార్,
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి, దీపిక చదవడం, క్రికెట్, షెటిల్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : పడాల అనిల్ కుమార్, సన్నాఫ్ పి.సాంబమూర్తి, ఎస్‌విఎన్ఆర్ స్కూల్, మల్లికార్జునకాలనీ, రాజాం.

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలస్యం ఎందుకు. ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే.
మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.



పత్తిపువ్వు

అక్బర్-బీర్బల్ కథలు

ఒకనాడు పాదుషావారు ఉద్యానవనంలో విహరిస్తున్నారు. అప్పుడు ఆయనకు అనేక రకాల పూలు కనిపించాయి. వాటి అందచందాలు, పరిమళం ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదేసమయంలో ఆయనకు ఒక చిన్న సందేహం కూడా కలిగింది. అన్ని రకాల పూలున్నాయికదా. వీటిలో ఏది గొప్పది? అనుకున్నారాయన.

మరునాటి సభలో అందరివైపు ఓసారి పరికించి చూచి లోకమునందలి పూలన్నిటిలో ఏది మంచిది? దానికి కారణమేమిటి? అని ప్రశ్నించారు.

సభలోని వారంతా బాగా ఆలోచించారు. కొంతమంది 'గులాబి' అని చెప్పారు. మరికొందరు 'సంపెంగ' అన్నారు. ఇంకొందరు 'దానిమ్మ-మల్లె' అని రకరకాలుగా చెప్పారు. కాని అందుకుగాను వారు చెప్పిన కారణాలు ఆయనకు నచ్చలేదు.

బీర్బల్ లేచి ఇలా అన్నాడు. 'ప్రభూ! లోకమునకు ఉపయోగపడే పూలలో పత్తిపువ్వునకు మించిన పువ్వు లేదు. దానికి పరిమళం లేకపోవచ్చు. అందం కూడా లేకపోవచ్చు. కానీ, అది మానవుల శరీరమును కాపాడుతోంది. పత్తిదారంతోనే వస్త్రములు తయారు చేస్తారు. ఇది మనకు తెలిసినదే. కాబట్టి లోకమునకు ఉపయోగపడే పువ్వు పత్తి పువ్వు' అన్నాడు బీర్బల్. పాదుషాకి ఈ కారణం బాగా నచ్చింది. అతని కుశాగ్రబుద్ధిని మెచ్చుకుని ఘనంగా సత్కరించారు.

బడాయి జెర్రి

ఇదిగిదిగో... ఈ జెర్రికి మనమంటే లెక్కేలేదు. ఎందుకంటే... మనకేమో రెండే కాళ్లుంటాయి. దానికేమో బోలెడన్ని కాళ్లుంటాయి. అందుకే ఆ బడాయి!

ఈ బడాయి జెర్రి ఆర్థ్రోపోడా జాతికి చెందినది. శరీరం అనేక ఖండితాలుగా వుంటుంది. ఒక్కో ఖండితానికీ ఒక్కో జత కాళ్లుంటాయి. ఒక జత విషపు కోరలుకూడా వుంటాయి. కొన్ని జెర్రులు కుడితే చాలా ప్రమాదం. ప్రపంచంలో దాదాపు 2800 రకాల జెర్రులున్నాయి. ఇంతకీ దీనికి ఎన్ని కాళ్లు వున్నాయో చెప్పనేలేదుకదూ.. 15 నుంచి 175 వరకు వుంటాయి.

✻ యాసలపు సూర్యారావు

బలిగొన్న మూఢనమ్మకం

ఆమె వివాహిత స్త్రీ. వయస్సు 25 సంవత్సరాలు. అతి సామాన్య వ్యవసాయ కూలీ కుటుంబం. భర్త జట్టు కూలీగా పని చేస్తున్నాడు. చాలీచాలని ఆదాయంలో బ్రతుకుబండిని ఈడ్చుకు వస్తున్నారు. వారికి ఒక మగబిడ్డ. ఇలాంటి స్థితిలో ఏ కారణం చేతనో ఆమెకు మానసికమైన జబ్బు ఆవరించింది. చెప్పాపెట్టకుండా ఎటుబడితే అటు వెళ్ళిపోవడం తనలో తానే ఏవేవో మాట్లాడుకోవడం, ఇతరులపై అకారణంగా కేకలు వేయడం సర్వసాధారణంగా మారిపోయింది. ఈ రకమైన చేష్టల కారణంగా కుటుంబ సభ్యులు అందుబాటులో వున్న వైద్యం చేయించారు. కాని ఫలితం లేకపోయింది. అప్పటికే దెయ్యం పట్టిందని, చేతబడి కూడా జరిగిందని ఇరుగు పొరుగు వారు చెప్పడంతో చాలా డబ్బు ఖర్చు చేసి భూత వైద్యుల వద్దకు కూడా తీసుకువెళ్ళారు. వీటివల్ల కూడా ఏమీ గుణం కనిపించలేదు.

ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో జరిగింది. ఎంతోకొంత నాగరికత గల చిన్నస్థాయి పట్టణంలో కూడా మూఢనమ్మకాలు ఎంతబలంగా వేళ్ళూనికుని వుంటాయో తెలుసుకోవటానికి ఈ వాస్తవ ఘటన ఒక మచ్చు తునక అనక తప్పదు. అనేక రకాల ప్రయత్నించి విసిగిపోయిన కుటుంబానికి ఒక ఆశాకిరణం కన్పించింది. తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన భూతవైద్యులు ఏ విధమైన, ఎంత పెద్ద భూతాన్నైనా ఇట్టే వదలగొడతారన్న సమాచారం తెలిసింది. వెంటనే ఏ మాత్రం జాప్యం చేయకుండా వెళ్ళి ఆ భూతవైద్యుల్ని తీసుకువచ్చారు. ఆ రోజు రాత్రి 10 గంటలు కావస్తోంది. పిశాచం ఆవరించినట్లు భావిస్తున్న స్త్రీని తలారా స్నానం చేయించారు. గదిలో అమ్మలక్కలు ఒకళ్ళిద్దరు కూడా కూర్చున్నారు. ఆమె ముఖం నిండా పసుపురాసి, కుంకుమతో పెద్ద బొట్టు పెట్టారు. నేల పీఠంపై ఆమెను కూర్చుండబెట్టారు. ఒక దుర్గాదేవి ఫొటోను కూడా పెట్టారు. కుండలో కాలుతున్న నిప్పులను పెట్టారు. రకరకాలుగా ముగ్గులు పెట్టారు. అరటి పువ్వు, కొబ్బరికాయలను కూడా పెట్టారు. భూతవైద్యులు కూడా నుదుటన కుంకుమ బొట్టు పెట్టుకున్నారు. ఇద్దరూ మొదట కొబ్బరికాయ కొట్టి అక్కడ పెట్టి గుగ్గిలం ధూపాన్ని వేశారు. చేతిలో చిన్న కర్రతో భూతవైద్యుడు, చెప్పు, నువ్వు ఎవరివో చెప్పు... చెప్పకపోయావో నీ అంతు తేలుస్తాం అని గట్టిగా అరిచారు. దానికి ఆ స్త్రీ వెర్రివెర్రిగా చూసి కళ్ళనీరు తెచ్చుకుని ఏడ్వడం మొదలు పెట్టింది. ఆ భూతవైద్యులు ఆమె జట్టు పట్టుకుని కొట్టడం, జుట్టును గట్టిగా మెలివేసి బిగించి పట్టుకుని గట్టిగా అరుస్తూ గద్దించడం మొదలు పెట్టారు. కానీ ఆమె కిక్కురుమనలేదు. వెంటనే కుటుంబ సభ్యులను పిలిచి కుంపటిని మరింత ఊది వేడి చేశారు. భూతవైద్యులు, తమకూడా తెచ్చిన ఇనుప ఊచలు కుంపటిలో పెట్టారు. కొద్దిసేపటి కల్లా అవి ఎర్రగా కాలి కణకణలాడుతున్నాయి. దెయ్యం పట్టినట్లుగా చెబుతున్న స్త్రీని గట్టి పట్టుకోమని ఆమె కుటుంబ సభ్యులను కోరారు. భూతవైద్యులు ఇద్దరూ కలిసి ఆమె కాళ్ళపై ఒకేసారి వాతలు వేశారు. గది తలుపులు గట్టిగా బిగించి వేసిన కారణంగా ఆ నాలుగు గోడల మధ్య ఆమె మూగరోదన బయటనున్న వారెవరూ వినలేకపోయారు. గుండెలవిసేలా బావురుమంటూ విలపించింది. నన్ను విడిచి పెట్టండని ఆర్తనాదాలు చేసింది. అయినా వినకుండా ఇంకా ఆమెకువీపుపైనా, చేతులపైనా కూడా ఇష్టం వచ్చినట్లు వాతలు పెట్టారు. ఆ గదంతా ఆమె ఆర్తనాదాలు మారు మోగాయి. భూతవైద్యుల రూపంలో వున్న ఆ కిరాతకులకు గానీ, అజ్ఞానంలో కూరుకుపోయిన కుటుంబ సభ్యులకు గానీ కనికరం కలగలేదు. అలా తనను వదలమని అరుస్తూ, ఏడుస్తూ ఆమె అక్కడే ఒరిగిపోయింది. అంతటితో ఆ రాక్షసకాండ ముగిసిందన్నట్లు ఆ భూతవైద్యులు దయతో ఆమెకు కొద్దిగా మంచినీరు తాగించి పడుకోబెట్టారు. ఉదయానికల్లా పిశాచం పీడ విరగడయిపోతుందని చెప్పారు. భూతవైద్యులు చెప్పిన మాటలతో ఆమెకు పట్టిన పీడ విరగడైందని సంతృప్తి చెందారు. తీసుకు వచ్చిన భూతవైద్యులకు ఒప్పందం ప్రకారం డబ్బు చెల్లించగా వారు వెళ్ళిపోయారు. కుటుంబ సభ్యులు కూడా హాయిగా నిద్రపోయారు. తెల్లారి లేచి చూసేసరికి మంచమ్మీద ఆమె కనిపించ లేదు. ఏమైందో ఎవరికీ అర్థం కాక గుట్టు చప్పుడు కాకుండా తలోదారి వెళ్ళి వెదకడం ప్రారంభించారు. ఎక్కడా దొరకలేదు. ఇలా మూడు రోజులు గడిచింది. మూడోరోజు ఉదయం అయిదింటికి 15 మీటర్ల దూరంలో వున్న మంచినీళ్ళ బావిలో శవమై తేలి ఆమె కన్పించింది. అంతా ఒక్కసారిగా బావురుమన్నారు. మూడోకంటికి తెలియకుండా స్థానిక పెద్దల సహకారంతో దహన సంస్కారాలు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. ఆ కుటుంబాన్ని పట్టి పీడించిన సమస్యలు ఆవిడ మానసిక రోగానికి కారణమయితే వారిలోని నిరక్షరాస్యత, వేళ్ళూనుకున్న మూఢనమ్మకాలు కలగలిపి ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

మార్కెటింగులో శక్తియుక్తులు!

హఠాత్తుగా గ్రైండర్ తిరగడం ఆగిపోయింది. దాన్ని చూస్తే నాకు పాపమనిపించింది. ముప్పయేళ్ళు నమ్మకంగా పని చేసింది. ఒకటి రెండు సార్లు చిన్న రిపేర్లు తప్ప ఏం కష్టం కలిగించకుండానే చెప్పినట్టల్లా తిరిగింది. అది! ఈ కాలంలో అంత సర్వీసు ఎవరిస్తున్నారు. ఏ వస్తువు చూసినా నాలుగైదేండ్లకే మూలబడిపోతున్నది! మళ్ళీ ఓ కొత్త కంపెనీ ఓ కొత్త వస్తువు కొనవలసి వస్తున్నది! అదీ కన్స్యూమరిజం మహత్యం మరి! నిశ్శబ్దమైపోయిన గ్రైండర్‌లో మళ్ళా చైతన్యం ఏమైనా తేవచ్చునేమో ప్రయత్నం చేద్దామని షాపుకు తీసుకుపోయాను. ఆ షాపులోనే ఇంతకుముందు బాగా చేయించాను ఆ గ్రైండర్‌ను.



దాన్ని చూడగానే "చాలా పాతదైపోయింది మేడమ్! ఎక్స్చేంజ్‌లో కొత్తది తీసుకోండి!" అన్నాడు సేల్స్‌మాన్. అట్లా అని గ్రైండర్ ఎట్లా అరిగిపోయిందో తూట్లు వడిందో చూపించాడు నాకు అతను. 'సరే! ఇంత జీర్ణమైపోయింది గనుక. దానికి విశ్రాంతి ఇయ్యడమే మంచిదేమో అనిపించింది నాకు.

ఏమేమి బ్రాండుల్లో గ్రైండర్‌లు దొరుకుతున్నాయో, ఏది మంచిదో వివరాలు అడిగి ఎక్స్చేంజ్‌లో ఒక గ్రైండర్ తీసుకున్నాన్నేను. బిల్లు చెల్లిద్దామని కౌంటరు దగ్గరికి పోయాను. కౌంటరులోవున్న ఓనరు చుట్టూ మంది గుమిగూడి వున్నారు. చిన్నా పెద్దా, ఆడా మగా చాలా మంది! మునికాళ్ళమీద నిక్కి ఓనరు వైపు చూశాను. అతని చుట్టూ 'ఫెంగ్‌షూయ్ వాస్తు' వస్తువులు పేర్చబడి కన్పించాయి. వాటిల్లోంచి కొన్ని వస్తువులు కుప్పగా పెట్టబడి వున్నాయి. వాటి బిల్లు వందల్లో వుంది ఓనరు రాస్తున్నాడు. వాటిని కొనే అతను, అతని పక్క ఓ అబ్బాయి వున్నారు. 'వీటితో మా వాడు చదువులో పైకి వస్తాడంటారా? వాడికి కాన్‌సెంట్రేషన్ కుదురుతుందంటారా?" అని అతను అడిగాడు. "తప్పకుండా మీ అబ్బాయి చదువులో పైన్ అవుతాడు. చూడండి మీరే మార్పును గుర్తిస్తారు" అన్నాడు ఓనరు. ఆ వస్తువులు తెలుసుకొని అతను వెళ్ళిపోయిం తర్వాత మరో ఆవిడ ముందుకు కదిలింది. తనకున్న షుగర్ నొప్పుల బాధల గురించి చెప్పింది. 'పెంగ్‌షూయ్' వస్తువుల్లోంచి ఆమెకు కొన్ని ఇచ్చాడు ఓనరు. ఆమె వందల్లోనే బిల్లు చెల్లించింది. ఆమె తర్వాత మరో ఆవిడ... "మా పక్కింటి వాళ్ళతో గొడవండి ఒకటే పంచాయితి. లొల్లి! శాంతి లేకుండా పోతున్నది..." అని చెప్పింది. "ఇదిగో! ఇది మీరు రాత్రిపూట మెత్త కింద పెట్టుకొని పడుకోవాలి. ఈ మాటలు... కాగితం మీద రాసిస్తాను. పడుకునే ముందు చదువుకోవాలి" అని బిల్లుతో పాటు ఓ కాగితం ఇచ్చాడామెకు. అట్లా క్యూ నడుస్తూనే వుంది. నేను క్యూలో నిలబడి ఆ వస్తువుల వైపు చూశాను.

అన్ని వస్తువులు 'మేడ్ ఇన్ తైవాన్' అని కన్పించాయి నాకు. ఏవో కొన్ని గణేశుని విగ్రహాలు ఓమ్ రాసి వున్న ప్లేట్లు తప్ప అన్నీ తైవాన్ నుంచి వచ్చినవే. ఆఖరికి మనిషికి సుఖశాంతులు పోటీని ఎదుర్కొనే శక్తి యుక్తులను వ్యాపారంలో, చదువులో విజయాలను సమకూర్చి పెట్టే ఈ వస్తురాశిని మనం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తున్నదే! అని నాకు బాధేసింది. మన యోగ, మెడిటేషన్లు చాలవని ఇటువంటి సరుకులను మనం దిగుమతి చేసుకుంటున్నామే! అని ఆశ్చర్యం కలిగింది ఇంతలో ఓనరు. "మేడమ్! మీకేం కావాలి!" అని అడిగాడు. వెంటనే నన్ను గుర్తు పట్టి "చాలా రోజులకు వచ్చారు మీరు" అని అడిగాడు. అతడు నిజానికి గుజరాతీ అతను. ఇంతకుముందు తెలుగు ఇంత స్వచ్ఛంగా మాట్లాడే వాడు కాదు. "భయ్యా! ఇప్పుడు తెలుగు బాగా నేర్చుకున్నారే!" అన్నాన్నేను.

"అందరి మాటలు విని నాకు తెలుగు వచ్చేసింది. బహన్‌జీ ఏం స్టీలు సామాను కొనలేదా?" అన్నాడు నా బిల్లును పరిశీలించి ఇంతకుముందు నేను స్టీలు సామాను కొనడానికి చాలాసార్లు ఆ షాపుకు వెళ్ళాను. "కొనలేదు. ఇప్పుడు ఈ గ్రైండర్లు బాగుచేయడమే కాదు కొత్త గ్రైండర్లు కూడా అమ్ముతున్నారు కద! ఇదో గ్రైండర్ కొన్నాను చాలు!" అన్నాన్నేను.

"బహన్‌జీ! స్టీలులో పీటలు అవీ వచ్చాయి తీసుకోండి" అని నాతో కొనిపించాలని చూశాడు. "ఏమీ వద్దు" అని "ఫెంగ్‌షూయ్ బాగా పెట్టారే!" అన్నాన్నేను.

"అవును బహన్‌జీ నాకు రెయిన్ వాస్తు కూడా తెలుసును. మీకేం ప్రాబ్లమ్ వున్నా రండి!" అన్నాడతను. స్టీలు గిన్నెలు గ్రైండర్లు బాగా చేయడం కొత్త గ్రైండర్లు అమ్మడమే కాక ఫెంగ్‌షూయ్, రెయిన్‌లను కూడా అమ్ముతున్న అతని వ్యాపార ప్రావీణ్యం చూసి నోరు తెరిచాన్నేను.

డిమాండును చూసి దుకాణంలో ఏమేమి పెట్టాలో అతనికి బాగా తెలుసు. ఏ ఏ వస్తువులకు గిరాకీ వుందో తెలుసుకొని వాటిని మార్కెటింగ్ చేసే అతని ప్రతిభకు నేను అవాక్కయిపోయాను. కాదేది కవితనర్హం అన్నట్లుగా కాదేది మార్కెటింగుకనర్హం! ప్రపంచీకరణంలో మరి ఇటువంటి మార్కెటింగు పవర్ కావాలి!.... బిల్లుపే చేసి ఆలోచిస్తున్న నాకు నా స్నేహితురాలు చెప్పిన ఉదంతం జ్ఞాపకం వచ్చింది.

అది బోర్నియోలోనట. ఒక లాలాగారి దుకాణం. ఆ దుకాణంలోకి బోర్నియో మూలవాసి జాతికి చెందిన ఒకతను వచ్చాడట... కాఫీ మగ్గులు కావాలని అడిగాడట. కొన్ని మగ్గులను చూశాడట బాగున్నాయి కాని నేను లెఫ్ట్ హ్యాజర్న్ లెఫ్ట్ సైడ్ కొండి వున్న మగ్గులు కావాలి అన్నాడట. "మీరు రేపు రండి లెఫ్ట్‌సైడ్ కొండి వుండే మగ్గులు తెప్పించి పెడ్తాను అని లాలా అన్నాడట. తెల్లవారి కొనే అతను రాగానే ఈ లాలా అదే మగ్గులను కొండి లెఫ్ట్‌సైడ్‌కు వుండేలా అతని ముందు పెట్టాడట. "యా! ఈ మగ్గులే నాకు కావాలి!" అని కొనుక్కొని వెళ్ళి పోయాడట! లాలాగారి మార్కెటింగు శక్తి యుక్తి అది! అయినా పోటీలో మన వస్తువులను అమ్ముకోవాలంటే శక్తి యుక్తులు అవసరమే. సింధునాగరికత కాలం నుంచీ వున్నాయి మార్కెటింగు శక్తులు! అవన్నీ లేందే మొహంజదారో, హరప్పా తవ్వకాల్లో అన్ని సీళ్ళు ఎందుకు దొరుకుతాయండి! ●

మొద్దబ్బాయి థియరీ!

*లక్ష్మి

కాలమూ దూరమూ తాలూకు లెక్కలు తమకు బాగానే తెలుసు! గణితం కదా - కరెక్టు ఆన్సరుకి పూర్తి మార్కులు పడతాయనే ఉద్దేశంతో చదువుకునే రోజుల్లో లెక్కలు మీద శ్రద్ధ ఎక్కువగానే పెట్టి వుంటారు. అంచేత లెక్కల్లో మీ పరిజ్ఞానమెంత అని మిమ్మల్ని పరీక్షించడం నాకిష్టం లేదు! ఎవరో కొందరు మొద్దబ్బాయిలుంటారు! లెక్కల మీద వాళ్ళకి మీకంటే ఎక్కువ శ్రద్ధ వుంటుంది! ప్రతి అంశం కూలంకషంగా ఆలోచించిగానీ వాళ్ళు కరెక్టు ఆన్సర్లు చెప్పరు. ఒక గుర్రం పది నిమిషాల్లో రెండు కిలోమీటర్లు దూరం పరుగెత్తును. అయిదు నిమిషాల్లో ఎంత దూరం పరుగెత్తుతుందని మేస్టారు అడిగినప్పుడు - చప్పున ఆన్సరు చెప్పరు! అది మామూలు గుర్రమా కుంటి గుర్రమా అని అడుగుతారు. ఏ గుర్రమైతే నీకెందుకు? నేను అడిగిందానికి సమాధానం చెప్పమని మేస్టారు కోప్పడినప్పుడు - కుంటి గుర్రమైతే పది అడుగులు పరుగెత్తుతుంది. మామూలు గుర్రమైతే కిలోమీటరు పరుగెత్తుతుందని సమాధానం చెబుతారు! ఆ దెబ్బతో మేస్టారి మెదడు చెడిపోతుంది! అంచేత మొద్దబ్బాయిల ముచ్చట్లు - లెక్కలకు నూటుగావు గనక వాళ్ళని విడిచిపెట్టండి! వాళ్ళ లెక్కల్ని లెక్కలుగా పరిగణించరు. అందులో జీవిత సత్యాలను మాత్రమే వెతుక్కుంటారు!

కిలో బియ్యంలో అరకిలో రాళ్ళు కలిపితే ఆ మొత్తం బరువెంత అని అడిగితే - ఆ బియ్యం కొన్నవాడు పోలీసైతే అమ్మిన వాడ్ని జైల్లో పెడతాడు అంటాడే గాని - ఆన్సరు గురించి ఆలోచించడు! అంచేత మొద్దబ్బాయి నుంచి మనకి కరెక్టు ఆన్సర్లు రావు! అతనికి పాఠాలు చెప్పే మేస్టారికి పిచ్చెక్కుతుంది. వదిలేయండి! గంటకింత వేగంతో పరుగెత్తే రైలు - ఇన్ని మైళ్ళు ఎంత సేపట్లో చేరుకుంటుందనో లేదా ఇన్ని గంటల్లో ఎన్ని మైళ్ళు వెడుతుందనో లెక్క ఎప్పుడో ఒకప్పుడు తమ దృష్టికి వచ్చే వుంటుంది. రైళ్ళూ, విమానాలూ వేగంతో తేడాల్లేకుండా సక్రమంగా నడుస్తాయనే ధీమాతో - కాలమూ దూరమూ లెక్కల్లో రైళ్ళూ విమానాలను ప్రవేశ పెట్టి వుంటారు. యంత్రాల్తో పని గనక వేగానికి గ్యారంటీ ఎక్కువ. ఆన్సరు కూడా - మొద్దబ్బాయి టైపులో కాకుండా - కరెక్టుగానే చెప్పచ్చు. ఈ లెక్కల్ని మనుషుల మీద తిప్పుకుంటే సరైన ఆన్సరుకి అవకాశముండదు!

మనిషికి ఉత్సాహమెక్కువైనప్పుడు స్పీడు పెరుగుతుంది! దిగులుగా వుంటే వేగం తగ్గుతుంది!



దార్లో కాలికి ముల్లు గుచ్చుకున్నా - వేలు పచ్చడైనా నడన్‌గా నడక ఆగిపోవచ్చు. కళ్ళు తిరిగి పడిపోయినా పోవచ్చు. అప్పిచ్చిన మనిషి ఎదురొస్తే వెనక్కి పరుగెత్తినా ఆశ్చర్య పడక్కర్లేదు. అందువల్ల మానసిక, శారీరక పరిస్థితుల మూలంగా వేగంలో తేడాలొస్తాయి. ఇంక లెక్కా డొక్కలెక్కడ ? మొద్దబ్బాయిలు ప్రతిపాయింటుకీ అడ్డం పడుతుంటారు! అంచేత మనుషుల్తో లెక్కలు ముడేసుకుంటే ఆన్సర్లు కరెక్టుగా రావు. మొద్దబ్బాయి టైపులో ఒక చిన్న లెక్క అనుకుందాం. పుచ్చపువ్వులాటి వెన్నెల్లో ప్రియుడూ ప్రియురాలూ కృష్ణా బేరేజీ మీద నడుస్తున్నారు. ఈ దరి నుంచి ఆదరికి ఇద్దరూ చేరాలంటే ఎంత సేపు పడుతుందనేది లెక్క. ఈ బాపతు లెక్కకి సరైన సమాధానం చచ్చినా దొరకదంటాడు మొద్దబ్బాయి!

వెన్నెల రాత్రి అనగానే ప్రియుడూ ప్రియురాలికి మెదళ్ళు పాడైపోతాయి! ఆరడుగులకొకసారి ఆగిపోతుంటారు. చేయీ చేయీ కలుపుకుంటారు. ఒకర్నొకరు అతుక్కుపోతారు. వెన్నెల అందంగా వుంది కదూ అని ఒకర్తో ఒకరు చెప్పుకుంటారు. చందమామని చూస్తో స్వీట్ నథింగ్స్ మాటాడుకుంటారు. ఈలోగా ఎవరో ఒకశాల్తీ అటుగా రావడం చూస్తారు. అతుక్కున్న ముద్ర నుంచి బయట పడతారు. ఏమీ ఎరగనట్టు దూరదూరంగా నడుస్తారు. ఎదురొచ్చిన మనిషి కనుమరుగైన తర్వాత మళ్ళీ ప్రేమికులు దగ్గరవుతారు! మళ్ళా అతుక్కుపోతారు! ఆ విధంగా వాళ్ళిద్దరూ అతుక్కుంటూ ఆగిపోతూ - తెల్లవార్లూ నడిచినా కృష్ణా బేరీజు దాటలేరు! ఆ కొంచెం దూరం నడిచేందుకు వాళ్ళిద్దరికీ వెరశి ఆరేడు గంటలు పడుతుందని చెప్పాలి. అదీ లెక్క!

అంతేదూరం ఒక్కరే నడిస్తే పది నిమిషాలు చాలు! పక్కనే ప్రియుడో ప్రియురాలో వుండి, ఆకాశాన్మీదున్న చంద్రుడు వెన్నెల కురిపిస్తుంటే మాత్రం అదే దూరాన్ని దాటేందుకు ఆరేడు గంటలు పడుతుంది. అంచేత - ఇల్లాంటి సందర్భాల్లో - కాలమూ దూరమూ లెక్కలూ ఆ సూత్రాలు పని చేయవు. ఆ యొక్క ప్రేమ తాలూకు పవర్ని బట్టి గంటల కొద్దీ టైం పెరుగుతుందే తప్ప - లెక్క ప్రకారం పది నిమిషాల్లో బేరీజు దాటడం అసంభవం! అంత మాత్రాన ఆ ప్రేమికులకు పెళ్ళయిం తర్వాత కూడా ఈ లెక్కకి గంటల్లోనే ఆన్సరొస్తుందని - అతను అనుకోకపోయినా - ఆమె అనుకోవడం పొరపాటు!

వాళ్ళకి పెళ్ళియిం తర్వాత మొద్దబ్బాయి థియరీ ప్రకారం - వాళ్ళ నడక తాలూకు వరుస మారుతుంది. వెన్నెల అతనికి చిరాగ్గా వుంటుంది. ఆ వెన్నెల్లో అక్కడక్కడ ఆగుతూ మెల్లిమెల్లిగా నడవాలనే తియ్యటి కోరికను తమకు పెళ్ళయిన ఆర్నెల్లలోనే అతను కట్ చేస్తాడు! ఆమె పోరుపడలేక ప్రోగ్రాం పెట్టుకున్నా - అతను ఆమె చేతినొదిలేసి చకచకా నడుస్తాడు. వెనకబడిన ఆమెను వేగంగా నడవమని అడుగడుక్కీ కోప్పడుతుంటాడు. ఆమెకప్పుడు గుర్రబ్బండి జ్ఞాపకమొస్తుంది. ఆమె గుర్రమవుతుంది. అతను బండి తోలేమనిషి అవుతాడు. నడునడు అనే అతని హెచ్చరికలు ఆమెకు బెత్తం దెబ్బల్లాగా తగుల్తాయి! అంచేత వేగం పెంచక తప్పదు. ఆ విధంగా ఆ ఇద్దరూ పది నిమిషాల్లో రాయవలసిన బేరేజిని - పరుగులాటి నడకతో - అయిదంటె అయిదు నిమిషాల్లో పూర్తి చేస్తారు. అప్పుడూ కూడా కాలమూ దూరమూ అనే లెక్క తప్పినట్టె అవుతుంది. పెళ్ళయితే అంతే - అంచనాలూ లెక్కలూ అన్నీ విడిచి పెట్టి కేవలం జీవిత సత్యాన్ని మాత్రమే ఆన్సరుగా చెబుతాడు మొద్దబ్బాయి! ●

❋ రుక్మిణి

మాట్లాడే శునకాలు

పచ్చబాబు గారికి బామ్మర్ది సోమయ్య ఆ దినం వుండుండి జెమాజెట్టీల్లాంటి అరడజను కుక్కల్ని తెచ్చి హుందాగా అందించాడు. పైగా అవి విదేశీ సంకరం సరకుని చంకలు వాయించాడు. కుక్కల్ని చూసి బాబుగారికి బహు ముచ్చటేసింది. వాటి దర్పం-ఠీవీ... విదేశీ లెవల్లో తోకాడించుటా... ముక్కుతో వాసన పీల్చుట చూసుకొని "ఆహాఁ.. ఎంతయినా సంకరం సంకరవే. అబ్బో... వీటి దెబ్బేవేరు... ఆ దర్జా, పౌరుషం... హమ్మ - చబ్బాస్ బామ్మర్దీ"- అని గూడలెగరేశాడు. సోమయ్య బెలూన్లా వుబ్బరించిపోయాడు. పోర్టికోలో ఇంటిముందు కుక్కలు చెయ్యినాకుతుండగా పక్కనే కూలబడి సన్నగా అంటించాడు. "బావోయ్... వీటి తేడా నీకు తెలవదు - గొప్ప కంప్యూటరు సరుకు... వాటి తాత ముత్తాతల... అమ్మ... అమ్మమ్మల జాతకాలు తిరగేసి మరీ ఎంపిక చేశా... సామాన్యమైనవేం కావు! వాసన శక్తి అమోఘం... ఇక పిక్కబలం.. కండర పుష్టి అద్భుతం... వీటి మెదళ్ళు వంద కంప్యూటర్లతో సమానం.... వుత్త వెబ్‌సైట్ బాపతే అనుకో... చెప్పిన విషయం నువ్వే మర్చిపోయినా నీ చొక్కాలేపి వీపుగోకి మరీ అవి గుర్తు చేస్తాయి... తమాషా కాదు...

సోమయ్య వాక్ప్రవాహానికి పచ్చబాబు అబ్బురపడిపోయాడు. భార్యమాత్రం తమ్ముడి వంక రుసరుస చూస్తూ "పాడుమేళం... పాడు నిర్వాకం... వెధవ సంత"! అని అక్కసుగా లోలోపల గొణుక్కుంటూ నిలబడిపోయింది.

"బావోయ్" సోమయ్య వెనుకేక పెట్టడంతో బాబుగారు ఒక్కసారే జడుసుకుని హడలిపోయాడు. "ఏంట్రాగాడిదా!" వీపు చరుచుకుని స్థిమిత పడ్డాడు.

"ఇంకో రహస్యం... వీటికి నువ్వు మాటలు నేర్పి మాలిమి చేసుకోవచ్చు! సుబ్బరంగా అవి మాటలు నేర్చుకుని నీతో ముచ్చట్లు కూడా పెడతాయి - అచ్చు మన రాంచిలకల్లానన్నమాట... హబ్బో..?"

సోమయ్య లొడలొడా చెప్పుకుపోతుంటే బాబుగారి భార్యకు ఈ విషయంలో మాత్రం తెగముచ్చటేసింది. పక్కనే కూలబడి కుక్కలను నిమురుతూ బహుచోద్యంగా-శ్రద్ధగా నోరు తెరిచి ఆలకించసాగింది.

"బావా... నీకు భలే కాలక్షేపం... బోరుకొట్టకుండా ముచ్చట్లు.... అదోరకం టైంపాసూ... అందుకే బావా... అన్ని లక్షలు తగలేసి ఖరీదు చేస్త...

బాబుగారికీ అంశం బహునచ్చిందాయె. వెంటనే వాటికి ఏ.సి.రూమూ-ఫారిన్ కన్సల్టెంటూ... అరడజను డాక్టర్లనూ అర్జంటుగా ఖాయం చేసి పారేశాడు. తర్వాత రోజూ వాటి వెంటబడి రెగ్యులర్‌గా ఉదయం రెండు గంటలూ... సాయంత్రం ఓ గంటా

వాటికి మాటల తర్ఫీదులో కూరుకుని మురిసిపోయాడు. విచిత్రం! అవి టంచన్‌గా తెలుగు, ఇంగ్లీషు - ఒక్కోసారి రెండూ కలిపి ధారాళంగా కాకున్నా పొడిపొడిగా మాటలకు తగులుకోవడంతో బాబుగారికీ... బాబుగారి భార్యగారికీ ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. అన్నీ వదిలేసి అదే ఓ పెద్ద కాలక్షేపం... కార్యక్రమంగా మారిపోయింది.

"ఏవండీ... బుజ్జిముండలు... ఎంత ముద్దుముద్దుగా వాగుతున్నాయి. హమ్మో... ఎవరికీ చెప్పకండి. దిష్టిమాపులు... హమ్మో... మన అదృష్టం..." అని రెగ్యులర్‌గా దిష్టితీసి ముద్దుచేసి గారాబం చేయడం మొదలు పెట్టింది. వాటికి రాజభోగం... ప్రిన్స్ ఆఫ్ వేల్స్ తరహా జీవితమైపాయె!

* * *

ఆ రోజు సాయంత్రం కాస్తంత చీకటి పడే వేళ బాబుగారు దర్జాగా తన అరడజను శునకాలతో రాజసంగా వాహ్యాళికి బయలుదేరాడు. అడివి దగ్గర్లోగదా! అడివి పొదలతో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. ఈ శునకరాజాలు తనను పరివేష్టించి వున్నంతవరకూ - నెవర్! తనకు వచ్చిన ప్రమాదం... రాబోయే ఇబ్బందీ లేదుగాక లేదు. ఇది కంప్యూటర్ రకం వెబ్‌సైట్ ట్రయిన్డ్ డాగ్స్! ఇంటలిజెంట్! ఇంగ్లీషు స్పీకింగ్! మరి మాటలా! అని తనలోనే అనుకునేంతలో కాస్తంత ఎడంగా పొదలో అలికిడి వినిపించింది. కళ్ళు మిటకరించి చూశాడు. సందేహం లేదు. ఏదో అడివి జంతువు. ఏం కావచ్చు! తోడలా... పులా... నో... నో... ఎలుగుబంటా? బాబుగారు వెంటనే ఛాతీ వుబ్బరించాడు.

"కమాన్ డాగ్స్... ఎటాక్"! చాలా మంద్ర స్వరంతో ఆర్డరు జారీ చేశాడు.

"కమాన్ డాగ్స్... ఎటాక్"! ఆరు కుక్కలూ తోకలు రిక్కరించి మంద్రస్వరంతో బృందగానం ఆలపించాయి. ముందు బాబుగారు తన చెవుల్ని తానే నమ్మలేక కాసేపు బిత్తరపోయాక... ఒళ్ళంతా మండిపోయి చిందులేశాడు. అవతల పొదల్లో నుండి నల్లని ఎలుగుబంటి మూతి వికారంగా విప్పిందాయె!

"బ్లడీఫూల్స్... ఎటాక్... ఎటాక్!"

"బ్లడీఫూల్స్... ఎటాక్... ఎటాక్"! అంతే వుచ్చస్వరంతో శునక రాజాలు అరిగిపోయిన రికార్డులా అరిచి తోకలాడించుకుంటూ బాబుగారి కేసి చూశాయి. 'గాండ్రు-గీండ్రు'మని గుబ్లెలుగు బాబుగారి భుజం మీద పంజావిసరడం... బాబుగారి గూడ ఎముక పుటుక్కుమనగా, హాహాకారాలు చేస్తూ గగ్గోలు పెడుతూ బాబుగారు పరుగులంకించుకున్నాడు. రక్తం... వరదలు.. శునకాలు తోకలాడించుకుంటూ వెంటబడ్డాయి.

మర్నాటి నుండీ శునకాల రాజభోగాలకు వేటుపడింది. ఏ.సి.నుండి కాంపౌండు గోడవార చింకి చాపమీదికి మకాం.. రుచికర పోషకాహార స్థానంలో గంజి! పైగా బాబుగారి భార్య బెల్టందుకుని ఉదయం-సాయంత్రం వరసబెట్టి వీరబాదుడు మొదలు పెట్టింది.

"ఒరె తమ్ముడూ రాస్కెల్! దీనికంతటికీ కారణం నువ్! ముండమోపి చవట కుక్కల్ని తెచ్చి - అవి మనిషి మాటలు మాట్లాడ్తాయనీ... డాబర్‌మన్ గ్యాంగనీ... కంప్యూటర్ వెబ్ జాతనీ బాకా వూత్తివిగదరా ముదనష్టపోడా... నా మంగళసూత్రం పుటుక్కుమని తెగేది గదరో నాయనో" అని సోమయ్యను పరమ బూతులు తిట్టింది. మంచంలో గూడ జారేసుకుని బాబుగారు మిటుకూమిటుకూ చూస్తున్నాడు.

"అదికాదె అక్కా... కుక్కల పని కుక్కల్తోని సరిగా చేయించాలె - మనింటిని జాగ్రత్తగా కాపలా కాయడం... దొంగలు వస్తే మొరిగి, వీలయితే పిక్కపట్టి పీకడం... గవీ... గట్లింటి పనులు చేయాల్సిన వాటితోని డాన్సులనీ, సంగీతవనీ.. ముచ్చట్లు పురాణ కాలక్షేపం పెడితే ఏమైతది? అసలు 'పని'కి పనికిరాకుండా పాయె! అయినా వాటికి మరీ అంతలేసి రాజభోగాలెందుకు బావా!" సోమయ్య లపలప వాగుతుంటే - హడలిపోతూ ఆమె వింటోంది!

శునకరాజుల స్వగతం : 'అసలు మమ్మల్ని మా డ్యూటీ' చేస్కోనీయకుండా - ఊరికే అన్నిట్లోనూ వేలు పెట్టమని ముందుకు తోసి - తన సరదాల కోసం.. కుతికోసం మా నోటితో ఏదిపడితే అది వాగించి - ఇవాళ మాకిట్లా కఠిన శిక్షలేసి - మా పరువులు తీయడం న్యాయమా...?"

అబ్బో... వాటి గోల వాటిది! ●

* డా॥ డి.ఎస్.రాజునాయుడు

క్యాన్సర్ రోగుల ఆశాకిరణం రేడియో థెరపి

రేడియోలజి నుంచి రేడియో థెరపి ఒక ప్రత్యేక ఉపవిభాగంగా పుట్టుకొచ్చింది. నేడు ఇది క్యాన్సర్ రోగుల పాలిట వరమైంది. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించని, శస్త్రచికిత్స స్థాయిని మించిపోయిన, మందులతో పూర్తిగా నిరోధించలేని రోగులలో ఆయా విధాల చికిత్సలతో పాటు రేడియో థెరపి క్యాన్సర్ రోగులకు మెరుగైన జీవితాన్ని అందించగలుగుతోంది. రేడియో థెరపి చికిత్స క్యాన్సర్‌ను ఎంతవరకు నిరోధించగలదన్నది ఆయా క్యాన్సర్ రకాల మీద ఆధారపడి ఉంటుంది.

నేడు వైద్యశాస్త్రం వందకు పైగా క్యాన్సర్‌లలో రకాలను గుర్తించింది. ధూమపానం, వక్క, కిళ్ళీలు నమలడం, ఆహారపు అలవాట్లు, మద్యపానం, వాతావరణ కాలుష్యం వంటి కారణాలేవైనా ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగానే కాక, మన దేశంలో కూడా క్యాన్సర్ రోగులను ఎక్కువగా గుర్తించడం జరుగుతున్నది. ముఖ్యంగా ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స చేయించుకోకపోవడం వల్లనే ఎక్కువ మందిలో ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో "క్యాన్సర్-రేడియోథెరపి, కీమోథెరపి చికిత్సలు" అన్న అంశంపై ఇటీవల, ప్రముఖ రేడియో థెరపి అంకాలజిస్ట్‌గా పేరు గాంచిన, గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోని "శ్రీచుండి రంగనాయకులు క్యాన్సర్ చికిత్సా విభాగంలో" అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ దేవనబోయిన శౌరి రాజునాయుడు గారితో జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలివి.



✦ అసలు "రేడియో థెరపి" అంటే ఏమిటి? దీని పుట్టుపూర్వోత్తరాలేమిటి ?

రేడియేషన్ ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులకు చికిత్స చేయడాన్నే 'రేడియో థెరపి' అనవచ్చును. ఎక్స్‌రేలు కనుగొన్న రెండు సంవత్సరాల అనంతరం నుండే రేడియేషన్‌ను క్యాన్సర్ చికిత్సకు వాడడం మొదలయింది. మొదట్లో రేడియేషన్ దుష్ఫలితాల గురించి ఎక్కువ అవగాహన లేదు. కాలక్రమేణా పరిశోధనల ఫలితంగా రేడియేషన్ దుష్పరిణామాలు, రేడియో బయాలజి అవగాహనకు వీలు కలిగింది. ప్రస్తుతం రేడియో థెరపిలో అనేక నూతన పద్ధతులు, అధునాతన పరికరాలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడిదాక శాస్త్రీయ పద్ధతిలో వైద్యాన్ని అందించే ప్రత్యేక విభాగంగా రూపొంది క్యాన్సర్ రోగులలో కొత్త ఆశల్ని చిగురింప చేస్తున్నది.

✦ క్యాన్సర్ అంటే ఏమిటి? క్యాన్సర్ రావడానికి కారణాలేమిటి ?

మానవ దేహం కణాలతో నిర్మితమైనదన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ కణాలలో అసాధారణత చోటు చేసుకున్న కారణంగా, సహజకణ విభజనను కోల్పోయి చాలా వేగంగా విభజనకు గురవుతాయి. ఇలా అసాధారణ వేగంతో కణ విభజనకు గురైన ప్రాంతంలో కణాల సంఖ్య విపరీతంగా పెరిగిన కారణంగా గడ్డలా కనిపిస్తాయి. దీనినే క్యాన్సర్ అనవచ్చును. ఈ గడ్డలలో కూడా చాలా నిదానంగా పెరిగే గడ్డలుంటాయి. వీటిని బినైన్ ట్యూమర్స్ అంటారు. ఇవి ఒక చోట నుండి మరోచోటకు విస్తరించలేవు. అంత ప్రమాదకరమైనవి కావు. శస్త్రచికిత్స ద్వారా సులభంగా తొలగించవచ్చు. వేగంగా పెరిగే గడ్డలనే 'క్యాన్సర్ గడ్డలు' లేదా మెలిగ్నెంట్ ట్యూమర్స్ అంటారు. ఇవి చాలా వేగంగా పెరుగుతాయి. శరీరంలో ఒక చోట నుండి మరోచోటకు విస్తరిస్తాయి. వ్యక్తిని బలహీనపరుస్తాయి. ప్రమాదకరమైనవి. వీటిని మొదటి దశలో శస్త్రచికిత్సద్వారా తొలగించవచ్చు. తర్వాత దశలలో శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా నిరోధించలేము. ఇక క్యాన్సర్ కారణాల విషయానికి వస్తే... నిజానికి శరీరంలోని ఏ భాగానికైనా క్యాన్సర్ రావచ్చును. కారణాలనేకం, ఈ క్యాన్సర్‌కు ఇదీ కారణం అని అన్ని క్యాన్సర్‌లలోను కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు.

స్థూలంగా పాశ్చాత్యదేశాల గణాంక వివరాల ప్రకారం ధూమపానం, ఆహార అలవాట్లు 85 శాతం క్యాన్సర్లకు కారణమవుతుండగా, వాతావరణ కాలుష్యం 5 శాతం, జన్యుసంబంధ మార్పులు 10 శాతం క్యాన్సర్‌లకు కారణమవుతున్నాయి.

✦ మెటాస్టేసిస్ అంటే ఏమిటి? ఎలా జరుగుతుంది?

శరీరంలో ఒకచోట జనించిన క్యాన్సర్ ఇతర భాగాలకు లేదా అవయవాలకు వ్యాప్తి చెందడాన్నే మెటాస్టేసిస్ లేదా సెకండరీస్ అంటారు. ఇది మాలిగ్నెంట్ ట్యూమర్స్ లేదా క్యాన్సర్ ప్రత్యేక లక్షణంగా పేర్కొనవచ్చు. మెటాస్టేసిస్ ప్రధానంగా మూడు విధాలుగా జరుగుతుంది. మొదటిది డైరెక్ట్ స్ప్రెడ్ అంటే ప్రత్యక్షంగా వ్యాప్తి చెందడం. రెండోది లింపాటిక్‌స్ప్రెడ్ అంటే శోషరస నాళాల ద్వారా వ్యాప్తి చెందడం, మూడోది హెమటో జీనస్ స్ప్రెడ్ అంటే రక్తప్రవాహం ద్వారా వ్యాప్తి చెందడం. ఏ పద్ధతి ద్వారా క్యాన్సర్ వ్యాప్తి చెందుతుంది అనేది ఆయా రకాల క్యానర్ మీద ఆధారపడి ఉంటుంది. అలానే ఏ ఏ క్యాన్సర్‌లు ఏ ఏ భాగాలకు లేదా అవయవాలకు వ్యాప్తి చెందుతాయి అన్నది కూడా క్యాన్సర్ వచ్చిన అవయవాన్ని బట్టి ఆధారపడుతుంది.

✦ క్యాన్సర్‌లో గల వివిధ స్టేజ్‌లను స్థూలంగా వివరిస్తారా?

నిజానికి క్యాన్సర్‌లో వివిధ స్టేజ్‌లను పాఠకులకు వివరించడం చాలా కష్టతరమవుతుంది. క్యాన్సర్‌లలో ఎన్నో రకాలున్నాయి. అన్ని రకాల క్యాన్సర్‌లకు ఒకే విధమైన స్టేజింగ్ ఉండదు. క్యాన్సర్ రకాన్ని బట్టి, అది వచ్చిన అవయవాలను బట్టి స్టేజింగ్ మారుతూ ఉంటుంది. క్యాన్సర్ వ్యాప్తి చెందడాన్ని బట్టి కూడా స్టేజింగ్ ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా మొదటి స్టేజ్‌లో క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స పొందితే ప్రోగ్నోసిస్ బాగానే ఉంటుంది. స్టేజింగ్ పెరిగే కొద్ది క్యాన్సర్ వైద్యుని చేయిదాటి పోతుందనే చెప్పాలి. కారణాలు ఏవైనా ఎక్కువ మంది రోగులు క్యాన్సర్ బాగా ముదిరిపోయాక అంటే మూడోదశలోనో, నాల్గోదశలోనో వైద్యుని సంప్రదిస్తున్నారు.

✦ మన దేశంలో సాధారణంగా కనిపిస్తోన్న క్యాన్సర్‌లు ఏమిటి?

మన దేశంలో ఎక్కువగా జీర్ణాశయ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, లంగ్‌క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, రెక్టల్ క్యాన్సర్, శోషరస గ్రంథుల క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ (ల్యుకేమియా), థైరాయిడ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, స్కిన్ క్యాన్సర్ మొదలైనవి పురుషులలో కనిపిస్తుండగా, వీటితో పాటు స్త్రీలలో సర్విక్స్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌లు ఎక్కువగా కనబడుతున్నవి.

✦ నేడు క్యాన్సర్ రోగులకు లభ్యమవుతున్న వివిధ చికిత్సా పద్ధతులేమిటి?

1. సర్జరీ (శస్త్రచికిత్స) - ప్రాథమిక దశలో వున్న క్యాన్సర్‌ను సర్జరీ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు. నేడు ఇందులో నిపుణులైన సర్జికల్ అంకాలజిస్టులు అందుబాటులోకి వస్తున్నారు. (క్యాన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని అంకాలజీ అంటారు); 2. రేడియోథెరపి; 3. కీమోథెరపి; 4. హార్మోనల్ థెరపి; 5. ఇమ్యునో థెరపి

చివరి రెండు పద్ధతులను చాలా తక్కువ మంది రోగులకు మాత్రమే వాడడం జరుగుతున్నది. విదేశాలలో ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.

✦ కీమో థెరపి అంటే ఏమిటి? దీని గురించి స్థూలంగా వివరిస్తారా?

వివిధ రకాల మందుల ద్వారా క్యాన్సర్‌కు చికిత్స చేయడాన్ని కీమోథెరపి అంటారు. క్యాన్సర్‌కు ఉపయోగించే మందులన్నీ 'రెండువైపుల పదునున్న కత్తి' వంటివే. ఈ మందులు నేడు వంద రకాలుగా లభ్యమవుతున్నాయి. వీటి గురించి అవగాహన, పరిజ్ఞానం ఉన్న వైద్యులు మాత్రమే వీటిని ప్రిస్క్రైబ్ చేయాల్సి ఉంటుంది. అరకొర పరిజ్ఞానంతో ఎవరుబడితే వారు, ఇతర వ్యాధులకు వాడే మందుల లాగా క్యాన్సర్ మందులు రికమండ్ చేయడం మంచిది కాదు. వీటి వల్ల తీవ్రమైన దుష్ఫలితాలుంటాయి. ఈ మందులు ఇస్తున్నప్పుడు రోగులను చాలా జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి. ఈ మందుల వాడకంలో నేడు 'మెడికల్ అంకాలజిస్టులు' పుట్టుకొచ్చారు.

✦ రేడియోథెరపి గురించి స్థూలంగా తెలియజేస్తారా?

మొదట్లోనే ప్రస్తావించినట్లుగా, క్యాన్సర్ కణాలను రేడియేషన్‌కు గురి చేసి నశింప చేయడాన్నే 'రేడియోథెరపి' అంటారు. ఇందులో మళ్ళీ రెండు పద్ధతులున్నాయి.

1. టెలిథెరపి : శరీరం వెలుపల నుంచి యంత్రాల ద్వారా రేడియేషన్ ఇవ్వడాన్నే 'టెలిథెరపి' అంటారు.

2. బ్రాకీ థెరపి : క్యాన్సర్‌కు గురైన అవయవాలలో రేడియో ఏక్టివ్ పదార్థాలను అమర్చి వాటి నుండి వెలువడే రేడియేషన్ ద్వారా క్యాన్సర్‌ను నయం చేయడాన్నే బ్రాకీ థెరపి అంటారు. ఈ రకమైన థెరపి ముఖ్యంగా థెరాయిడ్ క్యాన్సర్, స్త్రీల గర్భాశయ క్యాన్సర్‌లలో ఎక్కువగా ఉపయోగపడుతున్నది. రేడియో థెరపి వల్ల కూడా అనేక దుష్ఫలితాలు ఉంటాయి. ఈ దుష్ఫలితాలు రేడియేషన్ ఇచ్చే భాగాన్ని బట్టి ఉంటాయి. సాధారణంగా క్యాన్సర్ రోగులకు 4000 నుండి 6500 రాడ్స్ వరకు రేడియేషన్ ఇస్తుంటారు. (రేడియేషన్‌ను 'రాడ్స్'లలో కొలుస్తారు) ఈ రేడియేషన్‌ను కొన్ని వారాలలో ఇవ్వడం జరుగుతుంది.

✦ మన రాష్ట్రంలో రేడియోథెరపి యూనిట్లు ఎక్కడెక్కడ ఉన్నాయి? వీటికి ఎంత ఖర్చు అవుతుంది? పేద ప్రజలకు ప్రభుత్వం ఏమైనా సహాయం చేస్తున్నదా ?

మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ క్యాన్సర్ యూనిట్‌లు పని చేస్తున్నాయి. ప్రైవేటు క్యాన్సర్ యూనిట్‌లలో 4000 నుండి 10000 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ యూనిట్‌లలో ఎలాంటి ఛార్జీ వేయడం జరగదు. ఈ యూనిట్‌లు హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జె. క్యాన్సర్ హాస్పిటల్‌లోను, అపోలో హాస్పిటల్‌లోను, నిమ్స్‌లోను, గుంటూరు, తిరుపతి, వరంగల్, కర్నూలు, కాకినాడ, విశాఖపట్నంలలో ఉన్నాయి. అయితే కొన్ని చోట్ల సరిగా పని చేయడం లేదు. క్యాన్సర్ రోగులకు ప్రభుత్వం ప్రయాణం నిమిత్తం రాయితీలను కల్పిస్తున్నది. రోగి తన ఊరు నుండి క్యాన్సర్ యూనిట్‌కు వెళ్ళడానికి, రోగితో పాటు ఒక అటెండెంట్‌కు కూడా రైల్వే ఛార్జీలలో 1/4 వంతు తగ్గిస్తుంది.



✦ రేడియో థెరపి యూనిట్ చుట్టుపక్కల ఉండేవారికి రేడియేషన్ ప్రమాదాలేమైనా ఉంటాయా?

రేడియేషన్ యూనిట్ నెలకొల్పిన గది గోడలు చాలా మందంగా ప్రత్యేకంగా నిర్మించడం జరుగుతుంది. ఈ గోడలు రేడియేషన్‌ను బయటకు చొరబడనివ్వవు. అంతేకాక రేడియేషన్ యూనిట్ నుండి, వైద్యావసరాలకు మించి రేడియేషన్‌ను వెలువరించడం జరగదు. అందువల్ల చుట్టుపక్కల వారికి రేడియేషన్ ప్రమాదాలేమి ఉండవు.

✦ పైన పేర్కొన్న చికిత్సా విధానాలన్నీ ఒకే రోగికి అవసరమవుతాయా? లేక ఒక్కో రోగికి ఒక్కో చికిత్సా విధానం మాత్రమే సరిపోతుందా?

ఎన్నిరకాల చికిత్సా విధానాలు రోగికి అవసరమవుతాయి అన్నది, ఆ రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, స్టేజ్ మొదలయిన అంశాల మీద ఆధారపడి ఉంటాయి. ఇంతకు ముందే చెప్పినట్లుగా ప్రాథమిక దశలోని క్యాన్సర్‌ను శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే వీలున్నది. కొందరిలో శస్త్రచికిత్సతో పాటు కీమోథెరపి అవసరమవుతుంది. మరికొందరిలో ఆ రెండింటితో రేడియో థెరపి కూడా అవసరమవుతుంది. ఎడ్వాన్సుడ్ స్టేజ్‌లో ఉన్న క్యాన్సర్ రోగులకు రేడియోథెరపి లేదా కీమోథెరపి లేదా రెండూ అవసరమవుతాయి. ఇంతకు మించి ఆ రోగులకు మరో మార్గం లేదు. చికిత్సతో పాటు రోగికి బలమైన ఆహారం, మానసిక స్థైర్యం కూడా చాలా అవసరం అన్న విషయాన్ని మర్చిపోకూడదు.

(హెల్త్‌హెల్ప్ సౌజన్యంతో)

పుస్తక పరిచయం

ఒకే 'దండ'లో ఒదిగిన పలురకాల పూలు

'తప్పు'ని తప్పని చెప్పడంలో రెండు విధాలు. ఫలానా విషయం తప్పని నేరుగా చెప్పడం ఒక పద్ధతయితే, మంచేదో చెప్పి అలా లేదు కాబట్టి ఇది తప్పయిందని చెప్పడం రెండవ పద్ధతి. ఎక్కువగా మొదటి పద్ధతిలోనే వ్యవహారం నడిచిద్ది. ఎదుటివారిని తప్పు పట్టడంలోను, ఒక పుస్తకంలోని విషయాన్ని తప్పు పట్టడంలోనూ ఎక్కువ మంది అనుసరించేది మొదటి పద్ధతే. అందువల్లనే 'విమర్శ' అనేది విస్తృతార్థం నుండి సంకుచితత్వాన్ని సంతరించుకుంది. 'విమర్శ' అనగానే తప్పు పట్టడమో, నిందించడమో, తిట్టడమో వంటివి స్ఫురణకొస్తాయి. అంతేకానీ లోపాన్ని తడుముతూ మంచిని సూచించేదిగా 'విమర్శ'ని గుర్తించలేకపోతున్నా దానికి కారణం విమర్శించే విధానంలోనే ఉంది. ఆ విషయాన్ని గ్రహించి మంచి చెడులను తడిమి మంచిని ప్రశంసించి, చెడును సున్నితంగా తిరస్కరిస్తూ నూతనత్వం కోసం ఆరాటపడే విమర్శకులు తెలుగులో అరుదనే చెప్పాలి. అటువంటి కోవకి చెందిన వారిలో తెలకపల్లి రవి ఒకరు. విమర్శ, సమీక్ష అనగానే పుస్తకం ముందు, వెనుకలు చదివి నాలుగు మాటలు రాస్తారనే అపవాదు ఉంది. తెలుగు సమీక్షకులపై తె.ర. విమర్శ (సమీక్ష)లు చదివితే అలాంటి ఆలోచనలకు తావునివ్వవు. సాహిత్యంపై చేసిన సమీక్షల కన్నా రాజకీయ సమీక్షలు లోతుల్ని తడిమాయి. ఇదే విషయాన్ని సవినయంగా' తె.ర. తన 'మనవి'గా చెప్పుకోవడంలో నిజాయితీ, నిబద్ధత కన్పిస్తుంది. అప్పుడప్పుడు ప్రజాశక్తిలో పుస్తక సమీక్షలు, రాజకీయ విశ్లేషణా వ్యాసాలు, పరిచయ వ్యాసాలు పలు సందర్భాల్లో తన ఆలోచనలను అక్షరబద్ధం చేసినవన్నింటినీ ఒక పుస్తక రూపంలో (సారస్వత పరామర్శ)గా తీసుకురావడం హర్షించదగినదీ, అవసరమూ కూడా అన్పించింది. పుస్తకంలోని సమీక్షలు, చదువుతుంటే ఏవో కొన్ని నియమాలు, నిబంధనలు (కొలమానాలు) ఏర్పరచుకొని (గిరిగీసుకొని) రాసినట్లు కన్పించవు. సందర్భం,



వీక్షణ-సమీక్షణ
సారస్వత పరామర్శ
రచన : తెలకపల్లి రవి; **వెల :** రు.50/-;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

అవసరం, నాణ్యత వంటి త్రికరణ సూత్రముననుసరించినట్లు కన్పించడమనేది తె.ర. ప్రత్యేకతగా చెప్పుకోవచ్చునేమో. సున్నితమైన విషయాలపై తన ఆలోచనలను క్రమానుగతంగా సరితూకంగా ప్రకటించిన విధానం బాగుంది. ఆ కోవలో చెప్పుకోదగ్గ సమీక్ష 'శ్రుతిమించిన అతి తర్కం' (రంగనాయకమ్మ బుద్ధుడు చాలడు, అంబేద్కర్ చాలడు మార్క్స్ కావాలి అన్న పుస్తకం గురించిన సమీక్ష) దీనిలో పుస్తకంలోని వస్తువుకు (అంశానికి) జరిగిన అన్యాయాన్ని చెప్పారు. అంతేకాకుండా రంగనాయకమ్మ (మార్క్స్ సిద్ధాంతాలపై) చేసిన వివాదాస్పద, అసంపూర్తి, గందరగోళ వాక్యాలను చూపిస్తూ అసలేంటో చెప్పడం పాఠకున్ని ఒడ్డుమీదకు లాగేదిగా ఉంది. రంగనాయకమ్మ తన భావాలు పుస్తకంలోని మొదటి పేజీకి చివరిపేజికి విరుద్ధంగా ఎలా మారాయెూ! ఎందుకు మారాయెూ? విశ్లేషణాత్మకంగా చెప్పిన తీరు బాగుంది. రచయిత్రి చేసిన పొరపాట్లు దుందుడుకు వాక్యాలు, చిల్లర వ్యాఖ్యానాలు పాఠకుల్లో ఎలాంటి ఉద్రేకాలకు తావునిస్తాయో చెప్పడంలో జాగ్రత్తగా రాయాలనే అంతర్లీనత కన్పిస్తుంది (రచయిత్రికి). ఇక మీడియాపై రాసిన వాటిల్లో 'తెలుగు పత్రికారంగం నిన్న, నేడు, రేపు' పుస్తక సమీక్ష పరిశీలనలో పాక్షిక దృష్టి ఏల? అని ప్రశ్నించిన తీరు వాస్తవాల్ని దీసే ప్రయత్నాలను శాస్త్రీయతతో ఎలాంటి ఇజాన్ని ఆశ్రయించకుండా సమీక్ష చేశారు. చిన్నగా ఉన్నా గట్టిగా ఉందన్న విషయం సమీక్ష చదివిన ప్రతీపాఠకుడు అనుకుంటాడు మనస్సులో ఇప్పటికే కమ్యూనిస్టులపై జరుగుతున్న అడపాదడపా అవాస్తవాలు, కావాలని చిత్రించే వక్రీకరణలను సందర్భానుగుణంగా తె.ర. తన వ్యాసాల్లో ఎండగడుతూనే ఉండటం సిద్ధాంతంపై కమిట్‌మెంట్ ఉన్న వారికి ఆనందకరమైన విషయం. ఆ క్రమంలోనిదే తె.ర. రాసిన 'చలం సాహిత్యం : శతజయంతి సందర్శనం' అనే సుదీర్ఘ వ్యాసం ఒక కలుకితు రాయి.

"మానవజాతి మొదటి బానిస స్త్రీ అన్నాడు ఎంగెల్స్" అన్న కొటేషన్‌ని తె.ర. తన వ్యాసంలో వాడుకున్న సందర్భాన్ని, అవసరాన్ని విషయ గాఢతను పెంచిన ఆ మాటను చదివిన పాఠకుడు ఎలా మరువగలడు? దళిత, స్త్రీ వాద సాహిత్యాలపై వచ్చిన పుస్తకాలను సమగ్రంగా సమీక్ష చేసినప్పటికినీ దళితుల అవమానాలకు, ఇంకా ఏ ఇతర సమస్యలకైనా ఆర్థిక అసమానతలే కారణం అని చెప్పడం (కమ్యూనిస్టు దృక్పథం కావచ్చు) ప్రతీ సమస్యకు కమ్యూనిజాన్ని సమాధానంగా చేసుకుని రాయడం ఒకింత పాఠకున్ని అసహనానికి గురి చేస్తుంది. ఇది కాస్త తె.ర.కు కమ్యూనిజంపైనున్న పూర్తి నమ్మకంగా అనుకొని వదిలేస్తే శ్రీశ్రీ అనంతంపై రాసిన (మహాకవి ఆత్మకథ) సమీక్ష పరిపూర్ణ ప్రతిబింబంగా పాఠకుడు మర్చిపోలేదు.

- వేము

స్వీకారం



చెదిరిన సమాజం
ఇంగ్లీష్ మూలం :
చినువా అచెబీ;
తెలుగు అనువాదం:
కొలసాని సాంబశివరావు;
వెల : రు.30/-;
ప్రతులకు : మైత్రి బుక్‌హౌస్, విజయవాడ,



మనిషి (మినీకవితా మకరందం బులు'సు'భాషితం)
రచన : బులుసు వెంకటకామేశ్వరరావు
వెల : రు.20/-;
ప్రతులకు సీతా పబ్లికేషన్స్ 8-319/1, గొడుగుపేట, మచిలీపట్నం.

వందే శ్రీరామదూతం
రచన :
వేదుల శ్రీరామశర్మ (శిరీష);
వెల : రు.18/-;
ప్రతులకు :
డా॥ వేదుల శ్రీరామశర్మ (శిరీష), ప్రయోక్త, ఫ్రీలాన్సర్, డో.నెం.: 66-5-20, అశోక్‌నగర్, కాకినాడ; హనుమాన్ మందిరాలు; విశాలాంధ్ర, నవోదయ బ్రాంచీలు

సైబీరియా కొంగల విడిది వీరాపురం

✻ రాకెట్ల వీరన్న



సూర్యాస్తమయం అవుతుండగానే ఆ గ్రామం అందమే మారిపోతుంది. గ్రామంలోని రావి, చింత, వేప చెట్లకు విపరీతమైన అలంకారం వస్తుంది. చెట్లకు అలంకారం రావడమేమిటని ఆశ్చర్యంగా ఉందా! సంధ్యాసమయం కాగానే విదేశీ పక్షుల కిలకిలారావాలతో ఆ గ్రామం మారుమోగుతుంది. వీటిని చూసి కేరింతలు కొట్టే పిల్లలు. ఇది చూసిన పెద్దల ఆనందానికి హద్దే లేదనుకోండి. అనంతపురం జిల్లా, చిలమత్తూరు మండలంలోని వీరాపురం ఈ విదేశీ (సైబీరియా) పక్షులకు విడిది కేంద్రం. ఏడువేల కిలోమీటర్ల *దూరంలోని సైబీరియా నుండి ప్రతి సంవత్సరం ఈ* వీరాపురానికి పక్షులు వస్తాయి. ఫిబ్రవరిలో వచ్చి దాదాపు డిశంబరు వరకూ ఇక్కడ ఉంటాయి. గ్రామంలోని చెట్లపైన, పంటపొలాల్లోను, అక్కడక్కడ ఇండ్లపైన ఈ పక్షులు వాలి నప్పుడు చూపరుల ఆనందానికి హద్దులు ఉండవు. గ్రామానికి చుట్టుప్రక్కల 50 కి.మీ దాకా వెళ్లి ఇవి ఆహారాన్ని





తిని వస్తాయి. ఇవి పిల్లల్ని పొదిగి అవి పెద్దవై ఎగిరే శక్తి వచ్చే దాకా ఇక్కడే ఉంటాయి. డిశంబరులో తమ పిల్లలతో సహా సైబీరియాకు వెళ్లి పోతాయి. వంద సంవత్సరాల నుండి తూ.చ. తప్పకుండా ఈ పక్షులు తమ గ్రామానికి వస్తున్నాయని అక్కడి వృద్ధులు చెబుతున్నారు. ఎవరైనా కొత్తవాళ్లు తెలియక ఆ పక్షులను వేటాడడానికి ప్రయత్నిస్తే తాము సహించమని, అవి మాగ్రామస్థులకు కన్నబిడ్డలతో సమానమని చెబుతున్నారు. ఈ సైబీరియన్ పక్షులను ఫెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్స్ అంటారు. అయితే గ్రామస్థులు మాత్రం వీటిని ఎర్రమూతి కొంగలు, గూడబాతులు అని పిలుస్తారు. ఎర్రటి ముక్కుతో తెల్లగా ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని చూడడానికి జనం ఎగబడి వస్తారు.

అనంతపురం జిల్లా కేంద్రానికి 135 కి.మీ. దూరంలో ఈ వీరాపురం ఉంది. ఇది వలస పక్షుల విహారకేంద్రంగా పేరు పొందింది. అందమైన ఈ పక్షుల స్థూపాలను మరువకొత్తపల్లి, కొడికొండ చెక్‌పోస్టులలో టూరిజం శాఖ ఏర్పాటు చేసింది. ఇవి అందంగా ఆకర్షణీయంగా ఉండడమే కాక, వీరాపురానికి దారిని చూపేవిధంగా కూడా తోడ్పడుతున్నాయి. సైబీరియా నుండి వచ్చే వేల పక్షులకు ఇక్కడ బర్డ్స్ శాంక్చురీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనంతపురం కరువు జిల్లా అయినా దేశాలను, రాష్ట్రాలను దాటి ఈ జిల్లాకు వస్తున్నాయంటే వాటికి ఈ జిల్లా మీదున్న ప్రేమకు ఆగ్రామస్థులు గర్వ పడుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ సోమేష్‌కుమార్ వీరాపురాన్ని సందర్శించి పక్షుల సందర్శనార్థం వాటి ఆవాసం కోసం బర్డ్ శాంక్చురీ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాక పర్యాటకుల సౌకర్యార్థం బైనోగ్లాస్, విశ్రాంతిగదులు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే కలెక్టరు బదిలీ కావడంతో ఆ అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీరాపురాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి దగ్గరలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి ఉండడం వల్ల అక్కడకు వచ్చిన పర్యాటకులు వీరాపురం కూడా సందర్శించడానికి అవకాశముంది. ●

నీ సక్కదనం తెలిసిపాయె



పల్లవి :
నీ సక్కదనం తెలిసిపాయె చందరన్నా
నువ్వు బొంకుతున్న మాటలు వందలన్నా... ॥నీ సక్కదనం॥

చరణం :

1) గుక్కెడు నీళ్ళకై కోసెడంతా పోయి
సాగునీరు లేక కళ్ళొత్తుకుంటుంటె
నచ్చి చెడుతున్న మా గోడు పట్టదాయె
నీరు – మీరంటు మా నోరు కొడుతున్నావు ॥నీ సక్కదనం॥

2) నరాలన్ని దారాలుగా మార్చేసి
పట్టుబట్టి పట్టుబట్ట లెన్నొనేస్తె
పట్టుమని పట్టెడు బువ్వలేకపాయె
చేతిలో మగ్గమే చెలిమాయె చావుకు ॥నీ సక్కదనం॥

3) నకిలీలతో రైతు నట్టేట మునిగేను
కరువు రక్కసి చెంత గుండె చెరువాయె
సగటు మనిషి బతుకు చట్టుబండలాయె
హైటెక్కు పాలనలో బతుకు గండమాయె ॥నీ సక్కదనం॥

4) చేతి వృత్తిలోళ్ళు చెదిరిన గుండెతో
పల్లెవాసం వదలి పట్నాలకొస్తుంటే
జనం బాధ వదిలి జై జన్మభూమంటు
అవినీతి సోదరుల నాదుకొంటున్నావు ॥నీ సక్కదనం॥

5) అరచేత వైకుంఠాలెన్ని చూపెట్టినా
అభివృద్ధి పేరునా అప్పులే చేసినా
తెలుసుకొని తేనె తుట్టెలై లేస్తాము
తెలుసుకుంటె నిన్ను నెట్టి పారేస్తాము ॥నీ సక్కదనం॥

- సంపటం దుర్గా ప్రసాదరావు

లాఠీ ఛార్జి

లాఠీ
శాంతి భద్రతలు నిలబెట్టే రాజదండం
కల్తీ వ్యాపారులపై
అక్రమార్కులపై
ప్రజాజీవనాన్ని చిందర వందర చేసే
నేర హీరోలపై నాట్యం చేయాల్సిన లాఠీ
గురి తప్పి ప్రయాణం చేస్తుంది
ప్రజాస్వామ్య నియంతల
పదవులకు ధ్వజస్తంభంలా
కాపలాకాస్తుంది
రైతులు – కూలీలు
యువజనులూ ఉద్యోగులు
అందరూ బజారున పడుతున్నారు
విత్తనాలు సరఫరా చేయాలని
శ్రమకు తగ్గ కూలీ ఇవ్వాలని
విద్యా సౌకర్యాలు కల్పించాలని
ఉపాధి చూపించాలని
సమానావకాశాలు కల్పించాలని
జీవనభద్రతకు అభయ హస్తమివ్వాలని
ధర్నా – రాస్తారోకోలు
పికెటింగులు–నిరసన దీక్షలు
ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు
దిష్టిబొమ్మల దహన సంస్కారం చేస్తున్నారు.
చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకపోయినా
శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని
ప్రజాస్వామ్యానికి ప్రమాదకారులుగా ఉంటున్నారని
లాఠీఛార్జీ చేస్తుంది
ఎవరి తరపున లాఠీ పని చేస్తుంది
ఎవరి వీపులు పగులగొడుతుంది
ఎవరి తరపున వకాల్తా తీసుకొంటుంది
ప్రజాస్వామ్య రక్షణ కవచం ముసుగులో
ప్రజలపై స్వారీ చేస్తుంది లాఠీ
ప్రజాస్వామ్యం ఆసరాతో
బలిసిన పందులకు కాపలా కాస్తుంది

- వల్లభాపురం జనార్ధన

ప్రపంచ వ్యాప్తంగా మ్యాజిక్ కళకు విశేషాదరణవుంది. అటు వినోదాన్ని ఇటు విజ్ఞానాన్ని అందించే కళ ఏదంటే ముక్తకంఠంతో చెప్పేది ఇంద్రజాలమంటే అతిశయోక్తి కాదేమో. ఆసియా దేశాల్లో ముఖ్యంగా చైనా, సింగపూర్, మలేషియా తదితర దేశాల్లో మ్యాజిక్ ప్రదర్శనలు నిత్యం ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉంటాయి. సినిమా, టీవీ మాధ్యమాలకంటే అయా దేశాలలో ఇంద్రజాల కళనే ప్రజలు హార్థికంగా, ఆర్థికంగా ఎక్కువగా ఆదరిస్తుంటారు. భారతదేశంలోని ఇంద్రజాల కళాకారులు కూడా ముఖ్యంగా 'సర్కార్ కుటుంబం', అలాగే జాదూ ఆనంద్, కేరళరాష్ట్రానికి చెందిన గోపీనాద్ ముత్తుకాడ్, ఆంధ్రప్రదేశ్‌నుండి తొలిదశలో బి.వి.పట్టాభిరామ్, షాడో, చొక్కాపు ఇలా ఎందరో మ్యాజిక్ కళలో అంతర్జాతీయ ప్రమాణికతను ప్రదర్శిస్తూ భారతీయ కళాకారుల సత్తా చాటుతుండటం మనందరికీ తెలిసిందే. వీరందిరినీ ఆదర్శంగా తీసుకొని, తెలుగునాట 'అబ్రక దబ్ర' అంటూ అద్భుతాలు సృష్టిస్తూ.. ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ కళావైభవాన్ని నలుదిశలా చాటుతున్న మ్యాజిక్ వీరుడు మర్రి రమేష్ గురించి ఈ వారం తెలుసుకుందాం.

కళ వినోదం కోసమే కాదు

మర్రి రమేష్

తాను నేర్చుకున్న కళ కేవలం వినోదానికే పరిమితమయిపోకుండా సామాజిక చైతన్యానికి పురిగొల్పాలనే ధ్యేయంతో కళాకారుడిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న మర్రి రమేష్ మేజిక్ కళలో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. మ్యాజిక్ కళంటే ఉత్తరాదివారికే చెల్లిందనే విమర్శకు తిలోదకాలిస్తూ భారీ సాంకేతిక వనరులతో, సుమారు ఏభైమందికి పైగా అనుచరులతో, అంతర్జాతీయంగా గుర్తింపుకలిగిన 'ఇల్యూజన్'(గాలిలో మాయమయ్యే అంశాలు) ఐటమ్స్‌ను ప్రదర్శనలను మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశ పెట్టిన ఘనత రమేష్‌కే చెల్లుతుంది. సాక్షాత్తు పి.సి.సర్కార్ మర్రి కళాప్రతిభను స్వయంగా వీక్షించి భళారే భళా అంటూ కితాబునందించడం విశేషం.

ప్రత్యేక ఒరవడికి నాంది..

గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన ప్రజలకు అర్థమయ్యేరీతిలో చేతబడి, బాణామతి, ఎయిడ్స్‌లాంటి విషయాలపై అవగాహన కలిగించే నేపథ్యంలో రమేష్ అనేక అంశాలను ప్రదరిస్తుంటారు. అలాగే భారీ వ్యయంతో రూపొందించే 'అమ్మాయిని ఏ ఆధారంలేకుండా గాలిలో ఉంచడం, ప్రాణమున్న మనిషిని కత్తితో సగానికి కోయడం తిరిగి అతికించడం, గాలిలో వేదికపై మాయమైన అబ్బాయి ప్రేక్షకుల్లో ప్రత్యక్షంకావడం, కరెన్సీ నోట్లను ప్రేక్షకుల ఎదుటే కాల్చివేసి తిరిగి అదే నెంబరుగల కరెన్సీని సృష్టించడం'లాంటి అంశాలతో రమేష్ ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తారు. అలాగే కళ్లకు గంతలు కట్టుకొని విపరీతమైన రద్దీలో మోటారు బైక్‌ను నడపడం, తలమీద నిప్పంటించుకోవడం, పూలుదండల్ని పాముగా మార్చడం వంటి సాహసోపేత విన్యాసాలుకూడా రమేష్ చేయడం మరో విశేషం. నీటి ప్రాముఖ్యాన్ని తెలిపే వాటర్ ఆఫ్ ఇండియా, చైనీస్ రింగ్స్ వంటి అంశాలు రమేష్‌లోని ప్రత్యేకతను తెలియజేస్తాయి.

మ్యాజిక్ కళకే నా ఓటు

వృత్తిరీత్యా పంచాయతీరాజ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసే మర్రి రమేష్ ఉన్నతమైన ఉద్యోగంలో ఉన్నప్పటికీ మ్యాజిక్ కళ నాకు ప్రాణంవంటిదంటారు. కళా, ఉద్యోగమా ఏదో ఒకటి తేల్చుకోమంటే మాత్రం మ్యాజిక్ కళకే నా ఓటేస్తానంటూ నవ్వుతూ చెప్పే రమేష్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో వేలాది ప్రదర్శనలు పూర్తిచేశారు. అమెరికా తెలుగు అసోషియేషన్(తానా) వేదికపైనా అలాగే కాలిఫోర్నియా, దుబాయి, షార్జా, అబుదాబి, మస్కట్ తదితర దేశాల్లో రమేష్ తన మాజిక్‌కళను ప్రదర్శించారు.

సన్మాన-సత్కారాలు

రేలంగి ఆర్ట్స్ అకాడమీవారి 'రమణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మ్యాజిక్ అవార్డు', హైదరాబాద్ జె.ఎన్.టి.యువారి 'బెస్ట్ మెజీషియన్' అవార్డు, ఇండియన్ జూనియర్ ఛాంబర్‌వారి 'కమలపుత్ర', రాష్ట్రయూత్ సర్వీసెస్, నెహ్రూ యువకేంద్రవారి 'బెస్ట్ మెజీషియన్' తదితర అవార్డులు, పురస్కారాలు పొందిన రమేష్ తన మాయాజాల కళను 'తోకలేని పిట్ట' సినిమాలోకూడా ప్రదర్శించి వెండితెర ప్రేక్షకుల అభిమానాన్ని సొంతంచేసుకున్నారు. కళ కేవలం వినోదానికేకాదు, సామాజిక చైతాన్యానికి అంటూ నినదిస్తూ ఉన్నత ప్రమాణాలతో ఇంద్రజాలకళలో కృషి చేస్తున్న మర్రి రమేష్ మరింత ఖ్యాతినార్జించాలని కోరుకుందాం!

న్యాయసలహాలు

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వెలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు,
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

నా సమస్యకు పరిష్కారం చూపించరూ...

నాకు 1998లో పెద్దల సమక్షంలో పెళ్ళి అయ్యింది. పెళ్ళి అయిన తర్వాత రెండు నెలలు కూడా నా భర్త నాతో కాపురం చేయలేదు. నేను నల్లగా ఉన్నానని, తనకి ఇష్టం లేని పెళ్ళి చేశారని, తనని వదిలి నేను వెళ్ళాలని, తీవ్రంగా వత్తిడి తేవడంతో నేను మా తల్లిగారింటికి వెళ్ళాను. ఆ నాటి నుండి కూడా నేను మా తల్లిగారింటి వద్దనే ఉంటూ, మధ్యలో రెండు సార్లు కుల పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి నన్ను అత్తగారింటికి పంపించారు. అయినా మొదటిసారి లాగానే జరగడంతో నేను తిరిగి వచ్చి ఖమ్మంలో మా అత్తా, భర్తలపై కేసు పెట్టాను. దాంతో కుల పెద్దలు మా నాన్నగారిపై వత్తిడి తేవడంతో నాతో సంతకాలు పెట్టించారు. నేను మా నాన్నగారి ఒత్తిడికి, కుల పెద్దల వత్తిడికి తలొగ్గి ఏవో కాగితాలపై సంతకాలు చేశాను. దాంతో వారిపై కేసు కొట్టి వేయబడింది. ఈ మధ్యలో 'విడాకులు' కావాలని సూర్యాపేటలో అతను కేసు వేశాడు. నన్ను మా పుట్టింటి వారు పోషించలేమని అంటే మా అక్కయ్య వద్ద ఉంటున్నాను. నన్ను ఎవరూ పోషించే స్థితిలో లేరు. మా తల్లిదండ్రులు నాకు మరో పెళ్ళి చేసే స్థితిలో లేరు. నేను అతనితో కాపురం చేసే అవకాశం లేదా?. నాకు విడాకులు తప్పవా? అతని నుండి నేను ఏమైనా భరణం పొందగలనా? తెలుపగలరు.

- వి.లక్ష్మి, హైదరాబాద్

లక్ష్మిగారు,

మీరో ఏవో కాగితాలపై సంతకాలు చేశానంటున్నారు. బహుశా అవి రాజీ కాగితాలు కావచ్చు. ఆ కాగితంలో ఏముందనేది వివరంగా రాయలేదు. మీ అత్త, భర్తలపై మీరు ఐ.పి.సి. 498ఎ సెక్షన్ కింద మిమ్మల్ని బాధపెట్టారనే క్రిమినల్ కేసు కావచ్చు. అది కొట్టివేసి ఉండవచ్చు. అంతమాత్రం చేత మీ నుండి మీ భర్త గారికి మీ ఇష్టం లేకుండా 'విడాకులు' పొందడం అంత సులభం కాదు. మీరు న్యాయవాదిని నియమించుకుని దావాలో పాల్గొంటే మంచిది. విడాకులు అయినా, కాకున్నా మీరు మీ భర్త వద్ద నుండి భరణం పొందవచ్చు. ఈ భరణం కూడా మీ భర్త సంపాదనను బట్టి ఉంటుంది. ఏదో కాగితాలు అన్నారు. ఒకవేళ అవి పెద్ద మనుషుల సమక్షంలో రాసిన 'విడికాగితాలు' అయినా కూడా కోర్టులో చెల్లవు. మీరు భర్తనే కావాలనుకుంటే అదే విషయం ఆ కోర్టులో చెప్పండి. అంతేకాకుండా 'రిస్టిట్యూషన్ ఆఫ్ కాంజ్‌గల్ రైట్స్' అనే పిటిషన్ ద్వారా మీరు మీ భర్తతో తిరిగి కాపురం చేయడానికి ఒక దావా మీ భర్త మీద కూడా వేసి కాపురానికి వెళ్ళే అవకాశం కూడా ఉంది. కాబట్టి మీ దగ్గరలో వున్న లాయర్‌ని సంప్రదించి పై విధంగా మీరు న్యాయం పొందవచ్చు.

కాలనీ వాసులే మోసం చేశారు

నేను జీడిమెట్ల నివాసిని, నా భార్య పేరిట నేను వీకర్ సెక్షన్ కాలనీలో ఒక ప్లాట్ తీసుకున్నాను. నాకిరువురు కుమారులు. ఇరువురు ఒకే సమయంలో చనిపోవడంతో నాకు దిక్కుతోచని పరిస్థితులలో మా కాలనీ వాసుడినే కొంత అప్పు అడగగ రు.10 బాండ్‌పై నాతో, నా భార్యతో కూడా సంతకం తీసుకుని కొంత మొత్తం అప్పుగా ఇచ్చాడు. ఆ ప్లాటు నా భార్య పేరిట వున్న సంగతి అతనికి తెలియక నేను అమ్మినట్లుగా ఆ కాగితం సృష్టించాడు. కొద్ది రోజుల తర్వాత ఆ ప్లాటు తనదేనని పంచాయితీకి రాగా పోలీస్ స్టేషన్లో నేను ఓ కేసు పెట్టాను. పోలీసులు దీనిని రిజిస్టర్ చేయలేదు. పలుకుబడి కలిగిన అవతలివారి పక్షాన దరఖాస్తు తీసుకుని మోసం చేసి నా భార్య ప్లాటుని, నా ప్లాటుగా అమ్మానని నాపై కేసు పెట్టారు. నాకేం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో కోర్టుకెళ్ళి బెయిల్ తెచ్చు కున్నాను. కాని పోలీసులు జోక్యం నేటికి తగ్గలేదు. నన్ను మా ప్లాటులో ఇల్లు కట్టుకోకుండా చేస్తున్నారు. దీనికి పరిష్కారం ఏమిటి ?

- పి.ఆర్.రావు, హైదరాబాద్

రావుగారు, మీ కాలనీ వాసులే మీకు అలా ద్రోహం చేయడం వారికి తగదు. మీరు వెంటనే వారు చేసిన తప్పును పోలీస్ స్టేషన్‌లో తెలియజేశారన్నారు. పోలీసులు అతని పలుకుబడి వల్ల అతనిపై కేసు పెట్టకుండా అతడు ఇచ్చిన కంప్లయింట్ ద్వారా మీ మీద కేసు పెట్టారన్నారు. పోలీసులు మీ కంప్లయింట్ రిజిష్టర్ చేయకుంటే మీకు సి.ఆర్.పి.సి. 200 సెక్షన్ కింద మెజిస్ట్రేట్ గారి వద్ద ప్రయివేట్‌గా పిటిషన్ వేసి, వారిపై చర్య తీసుకునేలా చేయవచ్చు. మీ భార్య సంతకం కూడా వుందన్నారు. కాబట్టి అతను అమ్మినట్లుగా చూపుతున్న కాగితం సివిల్ దావా కిందకు వస్తుందని, క్రిమినల్ కేసు కిందకు రాదని, మీరు హైకోర్టులో పిటిషన్ వేసి మీ మీద వున్న కేసును కొట్టి వేయించుకోవచ్చు. పోలీసులు సివిల్ తగాదాలో జోక్యం చేసుకోవద్దని ఎన్నోసార్లు, ఎన్నో కోర్టులు తీర్పు చెప్పాయి. మీరు ఈ విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారుల వద్దకి తీసుకెళ్ళండి. అయినా ఫలితం లేకుంటే హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి పోలీసుల జోక్యం లేకుండా చేసుకోవచ్చు. మీ ప్లాట్‌లో ఇల్లు కట్టడంపై కోర్టు మీ ఎదుటి పక్షం వారికి ఇంజక్షన్ ఆర్డర్ ఇస్తే తప్ప పోలీసులకు ఆపే హక్కు లేదు.

- 'సుధాదర' గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

శనగలు, ఆలూ కూర

కావలసిన వస్తువులు:

బొంబాయి శనగలు - 200 గ్రాములు

బంగాళా దుంపలు - రెండు

పెరుగు - ఒక కప్పు

జీలకర్ర - ఒక టేబుల్ స్పూన్

పసుపు - అర స్పూను

కారం - ఒక స్పూను

గరం మసాలా - ఒక స్పూను

తగినంత నూనె, ఉప్పు

కొత్తిమీర - ఒక కట్ట

చేసే విధానం :

శనగలను రాత్రి నానబెట్టుకోవాలి. ఉదయం వాటిని కొంచెం ఉప్పువేసి ఉడికించాలి. బంగాళాదుంపలను చిన్నచిన్న ముక్కలుగా కోసుకోవాలి. నూనెను వేడిచేసి అందులో జీలకర్ర వేయాలి. అది కొంచెం వేగగానే పసుపు, గరం మసాలా వేసి కొంచెం వేయించాలి. ఇప్పుడు బంగాళాదుంప ముక్కలను వేసి కొద్దిగా నీళ్ళుపోసి రెండు నిముషాలు ఉడికించాలి. ఇందులో పెరుగు, ఉప్పు, కారం వేసి బంగాళాదుంప ముక్కలను మెత్తగా ఉడికించాలి. అనంతరం ఉడకబెట్టి ఉంచుకున్న శనగలు వేసి బాగా కలపాలి. దించేముందు కొత్తిమీరను సన్నగా తరిగి పైన అలంకరించాలి. ఈ కూర పూరీ, చపాతీలో చాలా రుచిగా ఉంటుంది.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది